
ఆంధ్రజ్యోతి
****

ANDHRAJYOTHY



నల్లగొండ

5 | బుధవారం 22 జనవరి 2025

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 72

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.144	230	260
సూర్యాపేట	రూ.130	200	230
నల్లగొండ	రూ.130	200	230

ఉష్ణోగ్రత గరిష్ఠం 30.0 , కనిష్ఠం 16.4



పురావస్తు వైభవానికి చర్యలు

నామమాత్రం

చారిత్రక సాక్ష్యాలు శిలలు. వందల ఏళ్ల నాటి పరిస్థితులు, వైభవాన్ని చాటిచేప్పే శిలా సంపదకు ఉమ్మడి నల్లగొండ జిల్లా నెలవు. ఈ నేలలో ఆలయాలు, శాసనాలు, శిల్పాల రూపంలో ఎన్నో నిక్షిప్తమై ఉన్నాయి. బౌద్ధుల చరిత్రకు ఆనవాళ్లుగా నందికొండ, ఫణిగిరి, కొలనుపాక ఉండగా చారిత్రక శిలా సంపదను కొలమానంగా నిలిచే అద్భుత ఆలయాలు ఇక్కడే ఎన్నో ఉన్నాయి. వింత గొలిపే నల్లగొండ సమీపంలోని ఛాయాసోమేశ్వరాలయం, శిలా సంపదకు పిల్లలమర్రి మచ్చుతునకలు. చరిత్రకు నెలవుగా మారిన జిల్లాలో పురావస్తుశాఖ ప్రాంతీయ కార్యాలయం లేకపోవడంతో పురావస్తు సంపద రక్షణకు ఇబ్బందిగా మారింది. ఇటీవల పానగల్ ఛాయాసోమేశ్వరాలయాన్ని ప్రపంచ పురావస్తు సంపదగా గుర్తించేందుకు చేస్తామన్న ప్రయత్నాలు ఆదిలోనే నిలిచిపోయాయి. నల్లగొండలోని పురావస్తు మ్యూజియాన్ని ఆధునికీకరించి, ఛాయాసోమేశ్వరాలయానికి ప్రపంచ వారసత్వ గుర్తింపు తేవాలన్న సూచనలు ఇటీవల వెల్లువెత్తుతున్నాయి.

•6లో..

● ఆంధ్రజ్యోతి ప్రతినిధి, నల్లగొండ



నల్లగొండ మున్సిపాలిటీలో ఘర్షణ పడుతున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలు



పోలీసులు అరెస్ట్ చేస్తుండటంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కంచర్ల

నీలగిరి మునిసిపాలిటీలో

రణరంగం

- వివాదానికి దారితీసిన బీఆర్ఎస్ ఫ్లెక్సీల తొలగింపు
- మునిసిపాలిటీలో ధర్నాకు దిగిన మాజీ ఎమ్మెల్యే కంచర్ల
- కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య ఘర్షణ
- ఫర్నీచర్, పూల కుండీలు ధ్వంసం, ఉద్రిక్తత
- బీఆర్ఎస్, కంచర్లపై మండిపడ్డ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, గుమ్మల మోహన్‌రెడ్డి



నల్లగొండ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ మునిసిపల్ కార్యాలయం మంగళవారం రణరంగాన్ని తలపించింది. కాంగ్రెస్, బీఆర్ఎస్ నడుమ ఘర్షణ, తోపులాటలతో ఉద్రిక్తత కొనసాగింది. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన మహాధర్నాకు సంబంధించి పట్టణంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, హోర్డింగులను మున్సిపల్ సిబ్బంది తొలగించడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి నేతృత్వంలో శ్రేణులు మంగళవారం మునిసిపల్ కమిషనర్ ఛాంబర్ వద్ద ఆందోళనకు దిగాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ నడుమ ఘర్షణ చెలరేగి, మాజీ ఎమ్మెల్యేను పోలీసులు బలవంతంగా అరెస్ట్ చేసేంతవరకు వెళ్లింది.

రైతాంగ సమస్యలపై ఈనెల 21న నల్లగొండలో మహాధర్నాకు పార్టీ మిగతా 6వ పేజీలో...

గ్రామాల్లోకి వెళితే

కోమటిరెడ్డిపై తిరుగుబాటు

- మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి

•6లో..





చిట్యాల మండలం ఎలికట్టెలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్థులు

గ్రామసభల్లో నిలదీతలు

- జాబితాలపై అధికారులతో వాగ్వాదాలు
- దరఖాస్తు చేసుకున్నా పేర్లు లేవు
- తొలి విడతలోనే సంక్షేమ పథకాలు పొందాలని అందరి తపన
- సభలకు తరలివచ్చిన ప్రజలు

నల్లగొండ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేయనున్న సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపికపై జిల్లా యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా మంగళవారం గ్రామసభలు ప్రారంభమయ్యాయి. ఈ సభల్లో అధికారులు, ప్రజల మధ్య వాగ్వాదాలు, నిలదీతలు, ప్రశ్నల పరంపర కొనసాగింది. ఆశావహులు అధికంగా ఉండటం, అర్హుల జాబితాలో పేర్లు కొన్నే ఉండటంతో పలు గ్రామాల్లో ఘర్షణ వాతావరణంలో సభలు కొనసాగాయి. కొన్ని చోట్ల పోలీసులు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. జిల్లాలోని నల్లగొండ, నకిరేకల్, మునుగోడు, దేవరకొండ, నాగార్జునసాగర్, మిర్యాలగూడ నియోజకవర్గాల్లో కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌తోపాటు పలువురు ప్రజాప్రతినిధులు ఈ గ్రామసభల్లో పాల్గొన్నారు. ఈ సభలో వారికి ప్రజల నుంచి పెద్ద సంఖ్యలో సవాళ్లు ఎదురయ్యాయి. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు తామే ముందుగా లబ్ధిపొందాలనే ఉద్దేశంతో ప్రజలు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా నిలదీతలు ఎదురవ్వగా అందరికీ పథకాలు వర్తిస్తాయని ప్రజాప్రతినిధులు, అధికారులు వారిని సముదాయించారు. జాబితో పేరులేని వారి కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుచేసి అధికారులు దరఖాస్తు తీసుకున్నారు. ఈ దరఖాస్తులను పరిశీలించి పథకాలు వర్తింపజేస్తామని అధికారులు గ్రామస్థులను సముదాయించి సభలను తొలిరోజు ముగించారు.

ప్రభుత్వం ఈ నెల 26వ తేదీ నుంచి అమలుచేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులకు లబ్ధిదారుల ఎంపిక కోసం మంగళవారం జిల్లా వ్యాప్తంగా గ్రామసభలు కొనసాగాయి. ప్రభుత్వం ముందుగానే కొందరు అర్హులతో అధికారులకు జాబితాలు పంపగా వాటిని గ్రామసభల్లో చదివి వినిపించారు. అయితే సంక్షేమ పథకాలకు గతంలో 'ప్రజాపాలన' సందర్భంగా దరఖాస్తు చేసుకున్నా, పలువురి పేర్లు ఈ జాబితాల్లో లేకపోవడంవతో అధికారులను ప్రజలు నిలదీశారు. సంక్షేమ పథకం కోసం దరఖాస్తు చేసుకున్నా జాబితాలో పేరు ఎందుకు లేదని ప్రశ్నించారు. సంక్షేమ పథకాల అమలుకు సర్వే అనంతరం చేపట్టిన గ్రామసభల్లో జనం నుంచి అధికార యంత్రాంగానికి ఊహించని విధంగా ప్రశ్నలు ఎదురయ్యాయి.

జిల్లాలో మొత్తం 844 గ్రామపంచాయతీలు, ఎనిమిది మునిసిపాలిటీలు ఉన్నాయి. కాగా, అధికారులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి సభలు నిర్వహించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా తదితర పథకాలకు ఈ నెలాఖరు వరకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేయాలని యంత్రాంగం చూస్తోంది. ప్రభుత్వం ఇప్పటికే మార్గదర్శకాలు, మిగతా 7వ పేజీలో...

జిల్లాలో తొలిరోజు ఇలా...

గ్రామసభలు	:	223
వార్డుసభలు	:	48

దరఖాస్తులు ఇలా...

రేషన్‌కార్డు	:	10,500
ఇందిరమ్మ ఇళ్లు	:	8,029

కనీస వేతనం అమలు చేయాలి

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి



ఆశాల పాదయాత్రను ప్రారంభిస్తున్న తుమ్మల వీరారెడ్డి

నల్లగొండ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఆశావర్కర్లకు రూ.18వేల కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం రాష్ట్ర ఆశా వర్కర్స్ యూనియన్ పిలుపు మేరకు 10కిలోమీటర్ల పాదయాత్రను జిల్లా కేంద్రంలో ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆశా కార్యకర్తలకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని, కనీస వేతనం రూ.18వేలకు పెంచుతామని ఎన్నికలకు ముందు కాంగ్రెస్ హామీ ఇచ్చిందన్నారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆశాల సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఆరోగ్యశాఖ మంత్రి, రాష్ట్ర ఉన్నత అధికారులకు, ఎమ్మెల్యేలకు, మంత్రులకు, పలుమార్లు వినతిపత్రాలు అందజేసినా సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదన్నారు. ఎన్‌హెచ్ఎం స్కీంలో భాగంగా 19 ఏళ్లుగా రాష్ట్రంలో ఆశా వర్కర్లు పనిచేస్తున్నారన్నారు. వారంతా బడుగు బలహీన వర్గాలకు చెందిన మహిళలని, ప్రసవాల సందర్భంగా రెండు మూడు రోజులు కుటుంబాన్ని వదిలి ఆస్పత్రుల వద్దే ఉండి విధులు నిర్వహిస్తున్నారన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 45వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సిఫారసులు అమలు చేయలేదని, దీంతో దేశవ్యాప్తంగా 10 లక్షల మంది ఆశా కార్యకర్తలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ.సలీమ్, దండంపల్లి సత్తయ్య, మల్లు గౌతమ్‌రెడ్డి, చింతపల్లి బయన్న, నల్ల వెంకటయ్య, ఏర్పుల యాదయ్య, పెంజెర్ల సైదులు, అద్దంకి నరసింహ, పోలె సత్యనారాయణ, పరమేశ్వరి, వెంకటమ్మ, టీ.పార్వతమ్మ, టీ.కల్పన, బి.మల్లేశ్వరి, కె.స్వర్ణ, ఎర్ర సౌజన్య, విజయకుమారి, ప్రేమలత, పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపిక కోసమే సభలు



నల్లగొండలో అర్హుల నుంచి దరఖాస్తులు తీసుకుంటున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేసేందుకే గ్రామ, వార్డు సభలు నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం నల్లగొండ మునిసిపాలిటీ 1వ వార్డు (పానగల్లు)లో నిర్వహించిన సభలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గత వారం క్రితం నుంచి నిర్వహించిన సర్వేలో అర్హత ఉన్న వారి పేర్లను గ్రామ, వార్డు సభల్లో చదివి వినిపిస్తున్నట్టు తెలిపారు. ఆయా జాబితాలపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే వాటిని పరిగణనలోకి తీసుకుంటామన్నారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల జాబితాల్లో పేర్లు లేనివారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. గ్రామ సభల్లో ఆయా పథకాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో ఏర్పాటుచేసిన ప్రజాపాలన మీసేవా కేంద్రాల్లో సైతం దరఖాస్తు సమర్పించవచ్చన్నారు. అర్హత ఉన్న ప్రతీ లబ్ధిదారుడికి పథకాలు అందించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. నూతనంగా తీసుకున్న దరఖాస్తులను రిజిస్టర్‌లో నమోదు చేయాలని అధికారులకు సూచించారు. గ్రామసభలో ఆమోదం పొందిన జాబితాలను ఎప్పటికప్పుడు డేటా ఎంట్రీ సైతం చేయిస్తున్నామన్నారు. గ్రామసభల్లో ప్రభుత్వ పథకాలకు వచ్చిన దరఖాస్తుదారుల పేర్లు మాత్రమే చదివి వినిపిస్తున్నామని, ఎట్టి పరిస్థితుల్లో అనర్హులు జాబితాలో ఉండరని, అర్హులందరికీ లబ్ధి చేకూరుతుందన్నారు. సమావేశంలో మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలి

(ఆంధ్రజ్యోతి, శాలిగౌరారం): గ్రామ సభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మండల పరిధిలోని వంగమర్తి గ్రామంలో నిర్వహించిన గ్రామసభను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను అధికారులు పరిశీలించి లబ్ధిదారులను ప్రకటిస్తారన్నారు. అనంతరం ఎమ్మెల్యే సామేలు మాట్లాడారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి మాన్యానాయక్, తహసీల్దార్ పి.యాదగిరి, ఏవో సౌమ్యశృతి పాల్గొన్నారు.

సాగు యోగ్యమైన భూములు 12లక్షల ఎకరాలు

నల్లగొండ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాగు యోగ్యమైన భూములు 12లక్షల ఎకరాలు ఉన్నట్లు అధికారులు తేల్చారు. ఈ నెల 16వ తేదీ నుంచి 20వ తేదీ వరకు క్షేత్రస్థాయిలో వ్యవసాయ, రెవెన్యూశాఖ అధికారులు నిర్వహించిన సర్వేలో రైతుభరోసాకు సంబంధించి ఏ మేరకు సాగు యోగ్యమైన భూములు ఉన్నాయనేది లెక్క తేలింది. జిల్లాలో 12లక్షల ఎకరాల భూమి సాగుకు యోగ్యంగా ఉండగా, 12వేల40ఎకరాలు గుట్టలు, రాళ్లు, ఇళ్లు ఉన్నట్లు లెక్కలు తేల్చారు. దీంతో ఆ భూములకు రైతు భరోసాను నిలిపివేయనున్నారు. ప్రభుత్వం రైతు భరోసాను సేద్యం చేసే భూములకు వేయాలనే నిర్ణయించిన నేపథ్యంలో అధికారులు గ్రామాల వారీగా, క్లస్టర్ల వారీగా లెక్కల్లో

12,040ఎకరాలకు రైతు భరోసా నిలిపివేత

లెక్కలు తేల్చిన అధికార యంత్రాంగం

నిమగ్నమై లెక్కలు తేల్చారు. ఈ నెల 26 నుంచి రైతు భరోసా నిధులను ప్రభుత్వం చెల్లించనున్న విషయం తెలిసిందే. ఎట్టి పరిస్థితులోనూ అనర్హులకు రైతుభరోసా ఇవ్వకూడదని స్పష్టం చేయడంతో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ సాగుకు యోగ్యమైన భూములకు ఈ నెల 26వ తేదీన ప్రభుత్వం రైతుభరోసా చెల్లిస్తుందని తెలిపారు.

పురావస్తు వైభవానికి చర్యలు నామమాత్రం!



- చారిత్రక కళాసంపదకు ఆదరణ కరువు
- ముందుకుసాగని ఛాయాసోమేశ్వరాలయ ప్రపంచ వారసత్వ గుర్తింపు ప్రక్రియ
- నల్లగొండలోని మ్యూజియాన్ని ఆధునికీకరించాలనే సూచనలు
- ఇప్పటికీ బయటపడుతోన్న చారిత్రక సంపదను కాపాడే కార్యాచరణ కరువు





నల్లగొండలోని పానగల్ మ్యూజియంలో శిలాశాసనాలు, మ్యూజియం ఎదుట ఏర్పాటు చేసిన అరుదైన శిల్పాలు

విశేషమైన పురావస్తు సంపదకు ఆదరణ కరువవుతోంది. ఆది మానవుడి కాలం నుంచి అన్ని యుగాలకు చెందిన విలువైన పురావస్తు కట్టడాలు,చరిత్రను తెలియజేసే ఆనవాళ్లను పరిరక్షించి, భవిష్యత్ తరాలకు అందించే కృషి లోపించింది. ప్రపంచ వారసత్వ సంపదకు అర్హత పొందే స్థాయిలో ఉన్న నల్లగొండ జిల్లా కేంద్ర సమీపంలోని పానగల్ ఛాయాసోమేశ్వరాలయం మొదలుకొని, ప్రఖ్యాత బౌద్ధారామాలుగా విరాజిల్లిన ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని నందికొండ, ఫణిగిరి, కొలనుపాక వంటి పురావస్తు ప్రాధాన్యమున్న ప్రాంతాల ప్రాశస్త్యాన్ని కాపాడుకునే ప్రయత్నం జరగడంలేదు. ప్రసిద్ధిగాంచిన ఛాయాసోమేశ్వరాలయానికి ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు సాధించడంలో ప్రభుత్వం తరుపున జరగాల్సిన కృషి జరగడం లేదనే విమర్శలు వస్తున్నాయి.





(ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అడుగడుగునా ఉన్న చారిత్రక ఆనవాళ్లను ఒకదరికి చేర్చే కార్యాచరణను చేపట్టలేకపోవడంతో అవన్నీ శిథిలమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. విశేషమైన పురావస్తు అవశేషాలు, సంపద కలిగిన ఉమ్మడి జిల్లాలో పురావస్తు శాఖను బలోపేతం చేసేదిశగా కార్యాచరణ చేపట్టాల్సిన ఆవశ్యకత నెలకొందని, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలనే సూచనలు వస్తున్నాయి.

ప్రపంచ వారసత్వ సంపదగా ఛాయాసోమేశ్వరాలయానికి గుర్తింపు దక్కేనా?

యునెస్కో ప్రపంచ వారసత్వ సంపద గుర్తింపు కోసం నల్లగొండలోని ఛాయాసోమేశ్వరాలయాన్ని ప్రతిపాదిస్తున్నట్లు ప్రభుత్వం గతేడాది ప్రకటించింది. టూరిజం, ఆర్కియాలజీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అసెంబ్లీలో, శాసనమండలిలో ఈ విషయాన్ని తెలిపారు. ఈ మేరకు తగిన ప్రతిపాదనలను రూపొందించి కేంద్రానికి నివేదించినట్లు మంత్రి ప్రకటించారు. అయితే ఆ తర్వాత జరగాల్సిన కృషి జరగకపోవడంతో ఈ ప్రక్రియ ఆగిపోయింది. ప్రపంచ వారసత్వ సంపదగా యునెస్కో గుర్తించాలంటే నిర్దిష్ట 10 ప్రమాణాల్లో కనీసం నాలుగైదింటిని సాధించేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఛాయాసోమేశ్వరాలయంలో ప్రపంచంలో ఎక్కడా లేని రీతిలో రాత్రి, పగలనే తేడా లేకుండా గర్భాలయంలో రాతిస్తంభపు నీడ కనిపిస్తుంటాయి. అప్పటి నిర్మాణ వైశిష్ట్యానికి దీన్ని నిదర్శనంగా చెబుతుంటారు. అదేవిధంగా ఇక్కడ కల్యాణి చాళుక్యుల కాలం నాటి శిల్పకళా సంపద, అరుదైన కళానైపుణ్యం ఈ ఆలయం సొంతం. ఇక్కడి చెరువులో నీరుంటే, సోమేశ్వరాలయ గర్భగుడిలోనూ నీరు ఉబికిరావడం మరో విశేషం. ఇలా ఎన్నో విశేషాలున్న ఈ ఆలయాన్ని ప్రపంచ వారసత్వ కట్టడంగా గుర్తించేందుకు ప్రయత్నాలు కొలిక్కితేవడంలో ప్రభుత్వం పట్టింపులేకుండా వ్యవహరిస్తోందని, దీనిపై ఇప్పటికైనా దృష్టిసారించాలనే సూచనలు వస్తున్నాయి.

చారిత్రక ఆనవాళ్లను కాపాడే కార్యాచరణ చేపట్టాలనే డిమాండ్

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇప్పటికీ పలు తవ్వకాల సందర్భంగా, ఆలయాల పునర్నిర్మాణాల సందర్భంగా విశేషమైన పురావస్తు సంపద, కళాఖండాలు, ప్రాచీన నాగరికతను తెలియజేసే ఆనవాళ్లు బయటపడుతున్నాయి. వీటిని స్థానికులు గుర్తించలేకపోవడంతో అవన్నీ ఎక్కడివక్కడ ఎలాంటి గుర్తింపు లేకుండా పడి ఉంటున్నాయి. పురావస్తు శాఖ పరిధిలోని ఛాయాసోమేశ్వరాలయం, పచ్చల సోమేశ్వరాలయం పరిసరాల్లో గతేడాది జనవరిలో పురావస్తు పరిశోధకులు 800 ఏళ్లనాటి కళాఖండాలను గుర్తించారు. అదేవిధంగా మిర్యాలగూడ సమీపంలోని నందిపాడు వద్ద 13వ శతాబ్దానికి చెందిన నందివిగ్రహాన్ని కనిపెట్టారు. కృష్ణా నదీతీరంలోని ముదిమాణిక్యం వద్ద 13 శతాబ్దానికి చెందిన దీపస్తంభం, పలు చారిత్రక ఆధారాలను గుర్తించారు. ఇలా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎన్నో చారిత్రక, పురాతన అవశేషాలు ఇప్పటికీ బయటపడుతున్నా వాటిని సంరక్షించడంలో మాత్రం ప్రభుత్వం, పురావస్తు శాఖ పట్టింపులేకుండా ఉంటున్నాయి. వీటన్నింటినీ పురావస్తు శాఖ గుర్తించి మ్యూజియానికి తరలించి భద్రపరిస్తే భవిష్యత్ తరాలకు గొప్ప వారసత్వ సంపదను అందించినవారవుతారని, ఈ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలనే సూచనలు వస్తున్నాయి.

పానగల్ మ్యూజియంను ఆధునీకరించాలనే సూచనలు

నల్లగొండ జిల్లా కేంద్రంలోని పానగల్ వద్ద నిర్మించిన పురావస్తుశాఖ మ్యూజియంను ఆధునికీకరించాలనే సూచనలు వస్తున్నాయి. పచ్చల సోమేశ్వరాలయాన్ని కలుపుకొని 3.39 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ మ్యూజియంలో ఉమ్మడి జిల్లాలో వేర్వేరు సందర్భాల్లో జరిగిన తవ్వకాల్లో బయటపడ్డ అవశేషాలతో పాటు, నాగార్జునసాగర్ నిర్మాణ సమయంలో బయటపడ్డ కట్టడాలు, పురాతన నిర్మాణాలను 695 వరకు పానగల్‌లోని పురావస్తు శాఖ మ్యూజియంలో భద్రపరిచారు. ఆది మానవుడి కాలం నుంచి 13వ, 18వ శతాబ్దాల వరకు ఉన్న విశేషాలు, కట్టడాలు, నాణేలు, పాత్రలు, బుద్ధుడి రూపాలు, తదితర ఎంతో విశేషమైన కళాసంపద భద్రపరిచారు. ఎంతో విలువైన పురావస్తు సంపద కలిగిన ఈ మ్యూజియానికి సరైన భద్రత లేదు. ఈ మ్యూజియానికి సీసీకెమెరాల పర్యవేక్షణ లోపించింది. చుట్టూ ప్రహరీ కూడా సరిగా లేకపోవడంతో అయిదేళ్ల క్రితం ఆక్రమణలకు ప్రయత్నించారు. అయితే పోలీసుల జోక్యంతో ఆక్రమణలు నిలిచాయి. మ్యూజియం బిల్డింగ్ బలహీనపడడంతో పాటు వర్షాలొస్తే కురుస్తుందని, దీంతో ఈ భవనాన్ని పునర్నిర్మించాలని కోరుతున్నారు. పర్యాటకులకు, సందర్శకులకు వాష్‌రూమ్‌లు సైతం అందుబాటులోలేని పరిస్థితి నెలకొంది. సిబ్బంది కొరత కూడా ఉండడంతో సరైన ఆలనాపాలనా కరువైంది. ఈ పరిస్థితుల్లో విలువైన పురావస్తు సంపద ఉన్న ఈ మ్యూజియాన్ని ఆధునికీకరించాలనే సూచనలు పర్యాటకులు, సందర్శకుల నుంచి వస్తున్నాయి.



విశేష పురావస్తు సంపద ఉన్నా.. ప్రాంతీయ కార్యాలయం కరువు

ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఎంతో విశేషమైన పురావస్తు సంపద, చారిత్రక ప్రాంతాలను గుర్తించి తమ పురావస్తు శాఖ ఆధీనంలోకి తీసుకొంది. ఇప్పటికే 59 చారిత్రక ప్రదేశాలను గుర్తించి ఆ శాఖలోకి వెళ్లాయి. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన నాగార్జునసాగర్(నందికొండ)తో పాటు చారిత్రక వైభవాన్ని చాటే పానగల్, ఫణిగిరి, కొలనుపాక, ఛాయా సోమేశ్వరాలయం, పిల్లలమర్రి వంటి ఎన్నో కీలకమైన సందర్శనీయమైన ప్రాంతాలు ఈ శాఖ పరిధిలో ఉన్నాయి. అయితే ఈ శాఖకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఒక ప్రాంతీయ కార్యాలయం లేకపోవడంతో పర్యవేక్షణ లోపించింది. ప్రస్తుతమున్న పురావస్తు ప్రాంతాలను పరిరక్షించడంతో పాటు, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తరచూ బయటపడుతున్న పురావస్తు సంపదను గుర్తించి భద్రపరచడానికి సిబ్బంది కొరత ఏర్పడింది. ప్రస్తుతం మహబూబ్‌నగర్‌లోని పురావస్తుశాఖ కార్యాలయ పరిధిలోనే ఉమ్మడి నల్లగొండ జిల్లా పురావస్తు కార్యకలాపాలు కొనసాగుతుండడం గమనార్హం. మహబూబ్‌నగర్ కేంద్రంగా పనిచేసే అసిస్టెంట్ డైరెక్టరే ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పురావస్తు క్షేత్రాలను పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఇక్కడున్న పరిస్థితులను, ప్రాధాన్యాలను దృష్టిలో ఉంచుకొని నల్లగొండ ఉమ్మడి జిల్లాకు పురావస్తు శాఖ ప్రాంతీయ కార్యాలయాన్ని కేటాయించి, ఏడీ స్థాయి అధికారిని నియమించాలని పలువురు చరిత్రకారులు, పురావస్తు పరిశోధకులు కోరుతున్నారు.

పురావస్తు నిర్మాణాలు బయటపడితే సమాచారమివ్వాలి

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎక్కడైనా తవ్వకాల్లో పురావస్తు నిర్మాణాలు, అవశేషాలు బయటపడితే సమాచారమివ్వాలి. మేం వాటిని పరిశీలించి నిర్ధారణ చేశాక మ్యూజియానికి తరలించి సంరక్షిస్తాం. ఇటీవల పానగల్ సమీపంలో బయటపడ్డ పురాతన కళాఖండాలను కూడా మ్యూజియానికి తరలించేందుకు చర్యలు తీసుకుంటాం. గ్రామస్థులు, దాతలు ముందుకొచ్చి వాటిని మ్యూజియానికి తరలించేందుకు సహకరించాలి. పురావస్తు సంపదను భవిష్యత్ తరాలకు అందించే బాధ్యత అందరిపై ఉంది. అందరి సహకారంతో ఈ పురావస్తు సంపదను పరిరక్షించే చర్యలు చేపడతాం.

నాగలక్ష్మి, అసిస్టెంట్ డైరెక్టర్, పురావస్తుశాఖ

కొయ్యలగూడెంలో విషాదఛాయలు



హైదరాబాద్‌లో చంద్రమౌళిని పరామర్శిస్తున్న మనోహర్‌రెడ్డి, కొయ్యలగూడెం గ్రామంలో చంద్రమౌళి కుటుంబ సభ్యులు నివసిస్తున్న ఇల్లు

చౌటుప్పల్ రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : అమెరికాలో దుండగుల కాల్పులలో మృతి చెందిన కొయ్యడ రవితేజ(27) స్వగ్రామం యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కొయ్యడ చంద్రమౌళి గౌడ్, సువర్ణ దంపతులకు కుమారుడు రవితేజ, కుమార్తె ఉన్నారు. చంద్రమౌళికి తోడ నలుగురు అన్నదమ్ములు. కాగా 25 ఏళ్ల కిందట ఉపాధి నిమిత్తం ఆయన నల్లగొండకు వెళ్లాడు. అక్కడ కొన్నేళ్లు ఉండి, పిల్లల చదువు కోసం హైదరాబాద్ వెళ్లాడు. ఇద్దరిని ఉన్నత విద్యలు చదివించాడు. ఉన్నత విద్య కోసం రవితేజ 2022 మార్చిలో అమెరికాలోని కనెక్టికట్ రాష్ట్రానికి వెళ్లారు. ఉద్యోగ వేటలో ఉన్న అతడు ప్రస్తుతం ఫుడ్ డెలివరీ బాయ్‌గా చేస్తున్నారు. భారత కాలమాన ప్రకారం ఆదివారం తెల్లవారుజామున 5.30గంటలకు రవితేజపై ఇద్దరు దుండగులు కాల్పులు జరపడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామానికి చెందిన యువకుడు దుండగుల కాల్పులలో మరణించడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అత్యంత నిరుపేద కుటుంబానికి చెందిన చంద్రమౌళి పిల్లల చదువులు కోసం ఉన్న కొద్దిపాటి అస్తులు విక్రయించాడని గ్రామస్థులు తెలిపారు. చంద్రమౌళి కుటుంబసభ్యులు తరుచుగా గ్రామానికి వచ్చేవారన్నారు.

ఈ నెల 25న అంత్యక్రియలకు ఏర్పాట్లు

కొయ్యడ రవితేజ మృతదేహాన్ని దేశానికి తీసుకువచ్చేందుకు అక్కడి తానా ప్రతినిధులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నెల 24న సాయంత్రం రవితేజ మృతదేహం కొయ్యలగూడెంకు వస్తుందని, ఈ నెల 25న అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్టు మాజీ సర్పంచ్ మాచర్ల కృష్ణ తెలిపారు. ఈ మేరకు అంత్యక్రియలకు కొయ్యలగూడెంలో కుటుంబసభ్యులు, గ్రామస్థులు ఏర్పాట్లు చేస్తున్నారు. రవితేజ తల్లితండ్రులు నివాసించిన ఇంటిని గ్రామపంచాయతీ సిబ్బంది శుభ్రం చేశారు. ప్రస్తుతం ఈ ఇంటిలో చంద్రమౌళి సోదరుడు ఉంటున్నారు. ఇదిలా ఉండగా హైదరాబాద్‌లో ఉంటున్న చంద్రమౌళిని పరామర్శించడానికి గ్రామానికి చెందిన పలువురు తరలివెళ్లారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ గంగిడి మనోహర్‌రెడ్డి చంద్రమౌళి కుటుంబసభ్యులను పరామర్శించారు. కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌తో అక్కడి నుంచి ఫోన్‌లో మాట్లాడించారు.

మాటలతో మభ్యపెట్టి పుస్తెలతాడు అపహరణ



సంఘటనను పోలీసులకు వివరిస్తున్న బాధితురాలు ధనమ్మ

భువనగిరి టౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : మాటలతో మభ్యపెట్టి మహిళ మెడలో నుంచి రూ.3.75లక్షల విలువైన ఐదు తులాల బంగారు పుస్తెలతాడు అపహరించారు. ఈ సంఘటన మంగళవారం యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరిలో జరిగింది. పట్టణ ఇన్‌స్పెక్టర్ సురేష్‌కుమార్, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం బొమ్మలరామారం మండల మర్యాల గ్రామానికి చెందిన మాలోతు ధనమ్మ కుటుంబంతో కలిసి బీబీనగర్ మండలం బట్టుగూడెంలో నివాసముంటోంది. అదే గ్రామంలో ఆమె కిరాణం దుకాణం నిర్వహిస్తోంది. అయితే ఆమె ఒంటరిగా సోమవారం స్వగ్రామానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో మంగళవారం భువనగిరి బస్టాండ్‌లో బస్సు దిగి పక్కనే గల సంతోష్‌నగర్‌లోని టైలర్‌కు ఇచ్చిన దుస్తులు తీసుకునేందుకు వెళ్లింది. దుకాణం మూసి ఉండటంతో పక్కనే కూర్చుంది. అయితే అప్పటికే ఆమె బంగారు గొలుసుపై కన్నువేసిన ముగ్గురు గుర్తుతెలియని ఆగంతకులు ఆమెను బస్టాండ్ నుంచి అనుసరిస్తూ మాటలు కలిపారు. ఆమెతో పాటు లేచి నడుస్తూ మాట్లాడుతూనే ఆమె మెడ నుంచి అందరూ చూస్తుండగానే పుస్తెలతాడును అపహరించుకొని అప్పటికే మూడు బైకులపై సిద్ధంగా ఉన్న మరో ముగ్గురితో కలిసి పారిపోయారు. అకస్మాత్తుగా జరిగిన సంఘటనతో భీతిల్లిన ఆమె అరుస్తూ వెంటపడినప్పటికీ ఫలితం దక్కలేదు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిసరాల్లో వెతికారు. సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు. బాధితురాలు ధనమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. ఒంటరిగా నడుచుకుంటూ వెళ్లే మహిళలు మెడలో విలువైన బంగారు ఆభరణాలు ధరించరాదని, మహిళలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

నీలగిరి మునిసిపాలిటీలో రణరంగం

(5వ పేజీ తరువాయి)

నాయకత్వం పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పట్టణంలో పెద్ద సంఖ్యలో ఫ్లెక్సీలు, హోర్డింగులు ఏర్పాటు చేశారు. పోలీసుల అనుమతి నిరాకరణతో మహాధర్నా వాయిదా పడిన నేపథ్యంలో మున్సిపల్ సిబ్బంది సోమవారం అర్ధరాత్రి ఈ హోర్డింగులు, ఫ్లెక్సీలను తొలగించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, పట్టణాధ్యక్షుడు బోనగిరి దేవేందర్, తదితరులు మునిసిపల్ కమిషనర్ ఛాంబర్ వద్దకు వెళ్లి ఆందోళనకు దిగారు. కాంగ్రెస్ నాయకులు ఒత్తిడి వల్లే ఫ్లెక్సీలను తొలగించారని మండిపడ్డారు. అక్కడ కమిషనర్‌లేకపోవడంతో ఆయన వచ్చేంతవరకు ఆందోళన కొనసాగిస్తామని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి కమిషనర్ ఛాంబర్‌లోనే కూర్చున్నారు. బీఆర్ఎస్ నాయకులంతా మునిసిపాలిటీ వద్ద మోహరించడంతో టూటౌన్ పోలీసులు రంగప్రవేశం చేశారు. కమిషనర్ సభలకు వెళ్లారని, ఆందోళన విరమించాలని వారు నచ్చజెప్పినా వినలేదు. అయినా వారు కదలకపోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దీంతో కంచర్లను బలవంతంగా తరలించాలని ప్రయత్నించిన పోలీసులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులకు, పోలీసుల మధ్య తోపులాట జరిగింది. విషయం తెలిసిన మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, వైస్‌చైర్మన్ రమేష్‌గౌడ్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మునిసిపల్ కార్యాలయానికి రావడంతో వాతావరణం ఉద్రిక్తంగా మారింది. ఆ సమయంలో ఇరువర్గాల నడుమ వాగ్వాదం, ఘర్షణ, పరస్పర హెచ్చరికలు కొనసాగాయి. ఇరువర్గాలు ఫర్నీచర్ ధ్వంసం చేయడంతో పాటు, ఒకరిపై ఒకరు పూలకుండీలను విసురుకున్నారు. పరిస్థితులు అదుపు తప్పడంతో పోలీసులు భూపాల్‌రెడ్డిని, బీఆర్ఎస్ నాయకులను బలవంతంగా కార్యాలయం నుంచి బయటకు తీసుకెళ్లి నాంపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆ తరువాత గొడవ సదుమణిగింది. నాంపల్లి స్టేషన్‌కు పార్టీ నాయకులను తరలించిన విషయం తెలిసి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్, జడ్పీ మాజీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, పైళ్ల శేఖర్‌రెడ్డి నాంపల్లి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి కంచర్లకు సంఘీభావం తెలిపారు. నాంపల్లి స్టేషన్ ఎదుట బీఆర్ఎస్ కార్యకర్తలు ఆందోళన నిర్వహించారు. సాయంత్రం మాజీ ఎమ్మెల్యేను, ఇతర నాయకులను పోలీసులు స్టేషన్ నుంచి విడుదల చేశారు. ఇదిలా ఉండగా మున్సిపాలిటీలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు దాడిచేసి, ఫర్నీచర్ ధ్వంసం చేశారని మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. తాను కార్యాలయంలో లేనని, వార్డు సభల్లో పాల్గొంటున్నానని చెప్పినప్పటికీ కార్యాలయంలోకి దౌర్జన్యంగా ప్రవేశించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

శ్రీనివాస్‌రెడ్డి, మోహన్‌రెడ్డిలపై కేసు నమోదు చేయండి

నల్లగొండ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ మునిసిపల్ కార్యాలయంలో తనపై దాడి చేసిన, అందుకు సహకరించిన వారిపై చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు మంగళవారం రాత్రి నల్లగొండ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తనపై దాడికి ప్రయత్నించిన మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డిపై, అందుకు సహకరించిన పోలీస్ అధికారులపై కేసు నమోదు చేయడంతో పాటు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుచేశారు. అదేవిధంగా టూటౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాఘవారావు, ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాజు, వన్ టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్‌రెడ్డిలపై చర్యలుతీసుకొని న్యాయం చేయాలన్నారు.



కాంగ్రెస్ నాయకులు బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, గుమ్ముల మోహన్‌రెడ్డిని నిలువరిస్తున్న పోలీసులు

కాంగ్రెస్ ఆగడాలు మితిమీరాయి: మాజీ ఎమ్మెల్యే కంచర్ల

నల్లగొండలో అధికార పార్టీ ఆగడాలు మితిమీరాయని, ప్రజాస్వామ్యం కనుమరుగవుతోందని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఆరోపించారు. రైతుధర్నాకు అనుమతి ఇచ్చినట్లే ఇచ్చిన పోలీసులు అధికార పార్టీ ఒత్తిడితో నిరాకరించారన్నారు. నెలల తరబడి కాంగ్రెస్ ఫ్లెక్సీలను తొలగించని మునిసిపల్ అధికారులు ఒక్కరోజులోనే బీఆర్ఎస్ ఫ్లెక్సీలను ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. ఈ విషయంపై మునిసిపల్ కమిషనర్‌ను అడుగుదామని వస్తే అధికార పార్టీ నేతలు గుండాలను వెంట వేసుకొచ్చి దాడులకు దిగారన్నారు. మునిసిపల్ ఛాంబర్ ఎదుట ధర్నా చేస్తే కాంగ్రెస్ పార్టీకి వచ్చిన అభ్యంతరం ఏంటని ప్రశ్నించారు. త్వరలోనే కాంగ్రెస్ అధికారానికి దూరం కావడం ఖాయమని, గత ఐదేళ్లలో, ఇప్పుడు ఎలా ఉందో ప్రజలు గమనిస్తున్నారన్నారు.

కంచర్ల నోరు అదుపులో పెట్టుకోవాలి: శ్రీనివాస్‌రెడ్డి, మోహన్‌రెడ్డి

మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకోవాలని, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని విమర్శిస్తే సహించేది లేదని మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి హెచ్చరించారు. ధర్నా చేయాలనుకుంటే మునిసిపల్ కార్యాలయం బయట చేయాలే తప్ప అధికారులు, ప్రజాప్రతినిధుల ఛాంబర్‌లోకి వచ్చి ఎలా చేస్తారని ప్రశ్నించారు. అధికారుల విధులకు ఆటంకాలు కల్పించారన్నారు. భూపాల్‌రెడ్డి మళ్లీ ఎమ్మెల్యే అయ్యేది లేదని, ఏదో పొరపాటున ఎమ్మెల్యే అయ్యారు తప్ప ఆయనకు ప్రజలపై విశ్వాసం ఉండదని, ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాడన్నారు. బీఆర్ఎస్ అరాచకాలకు పాల్పడుతోందని, ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ దౌర్జన్యాలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు.

గ్రామాల్లోకి వెళితే కోమటిరెడ్డిపై తిరుగుబాటు



సూర్యాపేటలో విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి

నల్లగొండ, సూర్యాపేట(కలెక్టరేట్), జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గ్రామాల్లోకి వెళితే తిరుగుబాటు తప్పదని మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఉదయం సూర్యాపేట, రాత్రి నల్లగొండ జిల్లా కేంద్రాల్లో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా అభివృద్ధిపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చర్చకు రావాలని సవాల్ విసిరారు. పదేళ్లలో తాము చేసిన అభివృద్ధి ఈ ఏడాదిలో కోమటిరెడ్డి చేసిన అభివృద్ధిపై చర్చకు వస్తే చూపిస్తామన్నారు. కాంగ్రెస్ నాయకులు వల్లే కరువుతో పాటు ఫ్లోరైడ్ పెరిగిందని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో నల్లగొండ ఆగమైందని తాము నల్లగొండను రూ.1500కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. నల్లగొండ జిల్లాలో పోలీస్, గుండాల రాజ్యం నడుస్తోందని ఆరోపించారు. గులాబీ జెండాను చూస్తే కోమటిరెడ్డికి భయం పట్టుకుందన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి మాజీ మంత్రి కేటీఆర్ ఫోబియా పట్టుకుందన్నారు. నల్లగొండలో భూపాల్ రెడ్డిపై దాడి చేయడం హేయమైన చర్య అని, కావాలనే కేటీఆర్ ధర్నాను అడ్డుకున్నారన్నారు. కేటీఆర్ పేరు వింటేనే కాంగ్రెస్ వెన్నులో వణుకు పుడుతుందన్నారు. పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తలుగా పనిచేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో పోలీస్ రాజ్యం అమలు చేస్తే చూస్తూ ఊరుకోమని, రాష్ట్రంలో పాలన ఇలానే కొనసాగితే తిరుగుబాటు తప్పదన్నారు. కాంగ్రెస్ రహిత తెలంగాణ కోసం నల్లగొండ నుంచే ఉద్యమం మొదలవుతుందని అన్నారు. నల్లగొండలో మంత్రి వెంకటరెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలను వదిలి మంగళవారం బీఆర్ఎస్ ధర్నా సందర్భంగా ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలను మునిసిపాలిటీ వారు చింపివేయడం ఎంతవరకు సమంజసమన్నారు. ఫ్లెక్సీలను తొలగించడాన్ని ప్రశ్నించేందుకు మునిసిపల్ కార్యాలయానికి వెళ్లిన మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డితో పాటు బీఆర్ఎస్ శ్రేణులను పోలీసులు అరెస్ట్ చేయడం తగదన్నారు. అయినా అక్కడికి కాంగ్రెస్ నాయకులు ఎందుకు వచ్చారని ప్రశ్నించారు. మంత్రి వెంకటరెడ్డి స్వయంగా కాంగ్రెస్ నాయకులకు ఫోన్ చేసి బీఆర్ఎస్ శ్రేణులపైకి ఉసిగొల్పుతున్నాడని ఆరోపించారు.

గ్రామ సభల్లో బయటపడుతున్న కాంగ్రెస్ నిజస్వరూపం

సంక్షేమ పథకాల అమలు కోసం నిర్వహిస్తున్న గ్రామసభల్లో కాంగ్రెస్ నిజ స్వరూపం బయటపడుతోందని మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి అన్నారు. ప్రస్తుత గ్రామసభలోనే ప్రభుత్వ డొల్లతనం బయటపడ్డదన్నారు. అన్ని గ్రామాల్లో ప్రభుత్వంపై నిరసనలు మొదలయ్యాయి అని పేర్కొన్నారు. ఇప్పటికే సంక్షేమ పథకాల అమలుకోసం రెండుసార్లు దరఖాస్తులు తీసుకుని వాటిని బుట్టదాఖలు చేసి నేడు మళ్లీ దరఖాస్తులు చేయాలనడం దారుణమన్నారు. కాంగ్రెస్ నాయకులు చెప్పినట్లుగా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారని ఆరోపించారు. ఆయా సమావేశాల్లో రాజ్యసభ మాజీ సభ్యుడు, బీఆర్ఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, నాయకులు రేగట్టే మల్లికార్జున్‌రెడ్డి, చెరుకు సుధాకర్, కంచర్ల కృష్ణారెడ్డి, మందడి సైదిరెడ్డి, బోనగిరి దేవేందర్, వై.వెంకటేశ్వర్లు, నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, సవరాల సత్యనారాయణ, తూడి నర్సింహారావు, దొంగరి యుగంధర్, నెమ్మాది భిక్షం, జీడి భిక్షం, పుట్ట కిశోర్‌కుమార్, ఉప్పల ఆనంద్, పాల్గొన్నారు.

బ్రెయిన్‌స్ట్రోక్‌తో ఆర్టీసీ కండక్టర్ మృతి



కనకమ్మ(ఫైల్‌ఫొటో)

మేళ్లచెర్వు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): బ్రెయిన్ స్ట్రోక్‌తో సూర్యాపేట జిల్లా కోదాడ ఆర్టీసీ డిపో మహిళా కండక్టర్ మంగళవారం మృతి చెందింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. నేరేడుచర్ల మండలం సోమారం గ్రామానికి చెందిన పెదపంగు కనకమ్మ(48) కోదాడ ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తుంది. భర్త మేళ్లచెర్వులోని మైహోంలో పనిచేస్తూ అక్కడే కాలనీలో వారు ఉంటున్నారు. సోమవారం ఉదయం విధి నిర్వహణ ముగించుకుని రాత్రి మేళ్లచెర్వు మండలం మైహోంకాలనీలోని ఇంటికి చేరుకుంది. అనంతరం ఆమె బ్రెయిన్‌స్ట్రోక్‌కు గురై ఇంట్లోనే మృతి చెందింది. మృతురాలి స్వగ్రామం సోమారం మంగళవారం కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. అప్పటివరకు విధులు నిర్వహించి ఉల్లాసంగా ఉన్న కనకమ్మ మృతి చెందటంతో ఆమె స్వగ్రామం, మైహోంకాలనీ, ఆర్టీసీ డిపోలో తీవ్ర విషాదం నెలకొంది. ఆమె మృతికి డిపో అధికారులు, మైహోం సిబ్బంది సంతాపం తెలిపారు. కనకమ్మకు భర్తతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు.

గ్రామసభల్లో తొలిరోజు రసాభాస

● అర్హులైన వారిని ఎంపిక చేయలేదని పలుచోట్ల ఆందోళనలు ● జాబితాల్లో తమ పేర్లు ఎందుకులేవని బైఠాయింపు ● పోలీసు బందోబస్తు మధ్య నిర్వహణ

పథకాల అమలు కోసం, అర్హులైన లబ్ధిదారుల ఎంపిక కోసం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మంగళవారం నిర్వహించిన గ్రామసభలు పలు చోట్ల రసాభాసగా మారాయి. అర్హులకు సంక్షేమ పథకాలు అందడం లేదని, అనర్హులకు అందుతున్నాయని ప్రజలు అధికారులను నిలదీశారు. సర్దిచెప్పేందుకు ప్రయత్నించినా శాంతించలేదు.



అనంతగిరిలో అధికారులను ప్రశ్నిస్తున్న గ్రామస్థులు

అనంతగిరి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం ఖానాపురం, అనంతగిరి, త్రిపురవరం, పాతగోల్‌తండా, వెంకట్రాంపురం గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన గ్రామసభలు రసాభాసగా మారాయి. రేషన్‌కార్డుల జాబితా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా జాబితా అని కొన్నిరోజులుగా సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడంతో కొట్టిన నేపథ్యంలో మంగళవారం నిర్వహించిన గ్రామసభల్లో జాబితాలో తమ పేర్లు ఎందుకు లేవని అధికారులను నిలదీశారు. అవి తుది జాబితాలు కావని అధికారులు ఎంతచెప్పినా గ్రామస్థులు వినలేదు. .

ఏ విధంగా సర్వే చేశారని నిలదీత

మర్రిగూడ, (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని మర్రిగూడ, ఎరగండ్లపల్లి, రాంరెడ్డిపల్లి, శివన్నగూడ, లెంకలపల్లి గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసాపై ఆయా గ్రామపంచాయతీల్లో అధికారులు చేసిన సర్వే వివరాలు చదివి వినిపించారు. అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అమలు చేయలేదని, సర్వే ఏ విధంగా చేశారని గ్రామస్థులు నిలదీశారు.

అధికార పార్టీ వారినే ఎంపిక చేశారని ఆందోళన

కొండమల్లేపల్లి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొర్రేనితండా, కేశ్యతండా గ్రామపంచాయతీల్లో కేవలం అధికార పార్టీకి చెందిన వ్యక్తులకు మాత్రమే లబ్ధిదారులుగా ఎంపిక చేశారని, అర్హులను విస్మరించారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమావత్ దస్రూనాయక్ ఆరోపించారు. తనకు కనీసం సమాచారం ఇవ్వలేదని, అర్హులను విస్మరించారని గుమ్మడవెల్లి గ్రామసభలో మాజీ సర్పంచ్ గుండెబోయిన లింగంయాదవ్ ఆరోపించారు.

కోదాడ రూరల్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిబండ, అడ్లూరు, కాపుగల్లు, అల్వాలపురం గ్రామాల్లో జరిగిన గ్రామసభల్లో ప్రజలు అధికారులను నిలదీశారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులను అర్హులుగా ఎంపిక చేయకుండా అనర్హులను ఎంపిక చేశారని నిరసన వ్యక్తం చేశారు. కాపుగల్లులో జాబితా చదువుతుండగా దరఖాస్తు చేసుకున్నా తమ పేర్లు రాలేదని అధికారులను నిలదీశారు.

యాదగిరిగుట్ట రూరల్, (ఆంధ్రజ్యోతి): రైతుబంధు పథకానికి సంబంధించి రెండు విడతల డబ్బులు రావాల్సి ఉందని మండలంలోని చొల్లేరు గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు, మాజీ సర్పంచ్ బీరయ్య అధికారులను నిలదీశారు. కాంగ్రెస్ నాయకులు కొక్కలకొండ అరుణ, గడ్డమీది శ్రీనివాస్‌గౌడ్ అడ్డుకున్నారు. పోలీసులు ఇద్దరినీ వారించారు. చిన్నకందుకూర్‌లో అనర్హులను పథకాలకు ఎంపిక చేశారని బీఆర్ఎస్ నాయకులు భీమగాని నర్సింహ్మగౌడ్, మల్లేష్ గౌడ్ నాయకులు అధికారులను నిలదీశారు. తుది జాబితా కాదని, అనర్హులుంటే విచారణ చేసి తొలగిస్తామని అధికారులు తెలిపారు.

చండూరు రూరల్, (ఆంధ్రజ్యోతి): భూమి, ఇల్లు, కార్లు ఉన్న వారిని పథకాలకు ఎంపిక చేయడం ఎంత వరకు సమంజసమని మండలంలోని బంగారిగడ్డ జోగిగూడెం, పుల్లెంల, గొల్లగూడెం గ్రామాల్లో జరిగిన సభల్లో గ్రామస్థులు నిలదీశారు. అనర్హులను ఎంపిక చేస్తున్నారని అధికారులతో వాగ్వాదానికి దిగారు. అధికార పార్టీ నాయకులు, బంధువులకు మాత్రమే పథకాలను అందిస్తున్నారని ఆయా గ్రామాల్లో ఆవేదన వ్యక్తం చేశారు.

సమయపాలన లేదు.. ఏర్పాట్లూ లేవు



అధికారులు రాకపోవడంతో చిట్యాలలో ఖాళీగా ఉన్న కుర్చీలు

చిట్యాల, (ఆంధ్రజ్యోతి): చిట్యాల మునిసిపాలిటీలో నిర్వహిస్తున్న ప్రజాపాలన వార్డు సభల్లో అధికారులు సమయపాలన పాటించలేదు. ఏర్పాట్లు కూడా సరిగ్గా చేయలేదు. రెండో వార్డులో ఏర్పాటు చేసిన వార్డు సభలో ప్రజలు, ప్రజాప్రతినిధులు హాజరైనా అధికారులు మాత్రం పదకొండు దాటినా రాలేదు. టెంట్, కుర్చీలు సరిపోకపోవడంతో ప్రజలు ఎండలోనే ప్రజలు ఎండలోనే నిలబడ్డారు.

గ్రామసభల్లో నిరసనలు.. వాగ్వాదాలు

నార్కట్‌పల్లి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్లారెడ్డిగూడెం, చెర్వుగట్టు, పల్లెపహాడ్, ఏపీలింగోటం, చిన్నతుమ్మలగూడెం, అక్కెనపల్లి, చిప్పలపల్లిలో గ్రామసభలు నిర్వహించారు. అర్హుల జాబితా తప్పుల తడకగా ఉండటంతో అధికారులు సమాధానం చెప్పలేకపోయారు. అర్హతలేని వారి పేర్లు సంక్షేమ పథకాల జాబితాలో ఉండటం, అర్హత ఉన్న వారి పేర్లు రాకపోవడం ఒకే ఇంట్లో అందరి పేర్లు అర్హుల జాబితా పేర్లలో రావడంతో అర్హత ఉండీ పేరు లేని బాధిత లబ్దిదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చెర్వుగట్టులో జరిగిన సభకు జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి, వేరే చోట్ల ఎంఎస్‌వో చరిత, తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీవో ఉమేశ్‌చారి, నాయబ్ తహసీల్దార్ రామకృష్ణ, ఏవో గౌతమ్, అరుణ్ కుమార్, సంతోశ్‌రెడ్డిలు హాజరయ్యారు.

గ్రామసభల్లో రేషన్‌కార్డుల లొల్లి

చిట్యాలరూరల్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏపూర్, ఎలికట్టె, గుండ్రాంపల్లి, బొంగోనిచెర్వు, వెంబావి గ్రామసభల్లో రేషన్‌కార్డుల గురించి అధికారులను ప్రశ్నించారు. ప్రజా పాలన, సమగ్ర ఇంటింటి సర్వే రోజు కూడా రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నా అర్హుల జాబితాలో తమ పేర్లు ఎందుకు లేవని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాలను అర్హులు కావాలంటే రేషన్‌కార్డు ప్రామాణికమని ముందుగా రేషన్‌కార్డులను మంజూరు డిమాండ్ చేశారు.

గ్రామ సభలో ఆగ్రహించిన రైతులు

చౌటుప్పల్ టౌన్,(ఆంధ్రజ్యోతి): వరి, పత్తి సాగు చేస్తున్న వ్యవసాయ భూములను రైతు భరోసా పథకం నుంచి తొలగించడం అన్యాయమని చౌటుప్పల్ మునిసిపాలిటీలోని 9వ వార్డులో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో రైతులు నిలదీశారు. సర్వే నంబర్లు 364, 365, 366లలో ఎ 3-12 గుంటల వ్యవసాయ భూమి ఉందని, ఈ భూమిలో వరి పంటను సాగు చేస్తున్నామని రైతు బొడ్డు శ్రీనివాస్‌రెడ్డి అధికారుల దృష్టికి తెచ్చారు. ఈ భూమిని రైతు భరోసా పథకం నుంచి తొలగించడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వే నంబర్-19లో ఎ 19-30 గుంటల వ్యవసాయ భూమి ఉందని, ఈ భూమిలో పత్తి పంట సాగు చేస్తున్నామని రైతులు గుణమోని అయిలయ్య, గుణమోని రాములు, గుణమోని కృష్ణ తెలిపారు. ఇందులో నుంచి ఎ 10-00 ఎకరాల సాగు భూమిని రైతు భరోసా పథకం నుంచి తొలగించడం అన్యాయమని తెలిపారు. రైతుల అభ్యంతరాలను పరిశీలించి పొరపాటు జరిగితే సరిచేస్తామని గ్రామసభ నిర్వహణాధికారి డి. శ్రీధర్‌రెడ్డి ప్రకటించారు. దీంతో రైతులు శాంతించారు.

మునుగోడు, (ఆంధ్రజ్యోతి): మునుగోడు మేజర్ గ్రామపంచాయతీ ఆవరణలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో గందరగోళం నెలకొంది. జాబితాలో అర్హుల పేర్లు గల్లంతయ్యాయంటూ పలువురు గ్రామ సభలో ఆగ్రహం వ్యక్తం చేశారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాల జాబితాలపై ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేశారు.

లబ్ధిదారుల జాబితా తప్పుల తడక

మోత్కూరు, (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మండలం దాచారం గ్రామంలో మంగళవారం నిర్వహించిన గ్రామసభలో ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారుల ముసాయిదా జాబితాలు తప్పుల తడకగా ఉన్నాయని గ్రామస్థులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోస, ఇందిరమ్మ ఇల్లు, రేషన్‌కార్డుల లబ్ధిదారుల ముసాయిదా జాబితాలు చదువుతుండగా ఐదేళ్ల క్రితం చనిపోయిన వ్యక్తికి రేషన్‌కార్డు ఎలా వస్తుంది. హైదరాబాద్‌లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు పొందిన వారికి మళ్లీ ఇక్కడ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తారా అంటూ పలువురు అధికారులను నిలదీశారు. గౌరమ్మ మృతిచెంది ఐదేళ్లు అయిందని, ఆమె పేరు కొత్త రేషన్‌కార్డుల జాబితాలో ఎలా ఉంటుందని ప్రశ్నించారు. ఇల్లు లేక మసీద్‌లో తలదాచుకుంటున్న కంటి చూపులేని షేక్ షరీఫ్ పేరు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాలో లేక, హైదరాబాద్‌లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు పొందిన మాధవి, వసంతల పేర్లు ఉండటమేమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న వారి పేర్లు కాకుండా ఇందిరమ్మ ఇళ్ల కమిటీ వారు సూచించిన పేర్లు వచ్చాయా అని ప్రశ్నించారు. ఈ జాబితాలు చూస్తేనే ప్రభుత్వం ఎంత పారదర్శకంగా పని చేస్తుందో తెలుస్తుందన్నారు. షరీఫ్‌కు కనీసం దివ్యాంగుల పింఛన్ కూడా రావడం లేదన్నారు. వ్యవసాయ భూములు, ఇళ్లు ఉన్నవారి (అనర్హుల) పేర్లు ఇందిరమ్మ ఆత్మీయ భరోస, ఇందిరమ్మ ఇళ్ల జాబితాల్లో ఉన్నాయన్నారు. అనర్హులను అధికారులు తొలగించకుండా గ్రామ సభలో చెప్పాలనడమేమిటని, తాము ఆ విషయాన్ని బయట పెడితే మాకు, మాకు తగాదాలు పెట్టడానికా అని ప్రశ్నించారు. అధికారులు జాబితాలు చదువకుండా గ్రామస్తులు ప్రశ్నల వర్షం కురిపిస్తూ, నిలదీయడంతో అధికారులు జాబితాల్లోంచి అనర్హులను తొలగించి, అర్హులకే పథకాలు వర్తింప జేస్తామన్నారు.

అర్హులకు పథకాలు రావడం లేదని..

పెద్దఅడిశర్లపల్లి, (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మండలంలోని పోల్కంపల్లి, మాదాపురం, అంగడిపేట ఎక్స్‌రోడ్డు, అక్కంపల్లి, మేడారం, తిరుమలగిరి, రోళ్లకల్లు, కోదండపురంలో ఎంపీడీవో, ఎమ్మార్వో, ఎంఈవో, వ్యవసాయ అధికారులు, ఏపీవోలు టీంగా ఏర్పడి ఆయా గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డుల పథకాలకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో భాగంగా ఉదయం 10 గంటలకు ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శి అధ్యక్షతన పథకాలకు సంబంధించిన వివరాలను ప్రజలకు చదివి వినిపించారు. గ్రామసభలో ప్రకటించిన పథకాల వివరాలు విన్న తర్వాత గ్రామ ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేశారు. పథకాలు కేవలం కొంతమందికి మాత్రమే అందజేసి చాలా మంది అసలైన అర్హులను పక్కనబెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు మాట్లాడుతూ పథకాలకు అర్హులుగా ఎంపిక కాకపోయినవారు నిరాశ చెందవద్దని గ్రామపంచాయతీ కార్యాలయాల్లో అర్హులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. అర్హులైన అందరికీ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమాల్లో ప్రత్యేకాధికారి నాగమల్లేశ్వర్‌రావు, ఎంపీడీవో చంద్రమౌళి, ఎమ్మార్వోలు మధుహాసిని, శ్రీనివాస్‌రావు, ఎంఈవో వెంకటయ్య, శ్రీనయ్య, ఏపీవో శ్రీనివాస్‌లు, పంచాయతీ కార్యదర్శులు రాంబాబు పాల్గొన్నారు.



గ్రామసభలో మాట్లాడుతున్న అధికారి

మధ్యలో నిలిచిన గ్రామసభ

చిలుకూరు, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు బేతవోలు, కొమ్ము బండతండా, జెర్రిపోతులగూడెం, ఆచార్యులగూడెం, రామాపురం, ఆర్లెగూడెం, సీత్లాతండా, జానకినగర్, నారాయణపురం గ్రామసభలు గందరగోళంగా మారాయి. అర్హత కలిగి ఉండి జాబితాలో పేర్లు లేనివారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రామాపురం గ్రామంలో రేషన్‌కార్డులు అర్హులకు రాకుండా అనర్హులకు వచ్చాయని గ్రామస్థులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. చిలుకూరులో నిర్వహించిన గ్రామసభలో గందరగోళం నెలకొనడంతో గ్రామసభ మధ్యలోనే నిలిచిపోయింది. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం సర్వేను అధికారులు కాకుండా ప్రైవేటు వ్యక్తులు సర్వే చేశారని, అనర్హులను గుర్తించారని అధికారులతో గ్రామస్థు లు వాగ్వాదానికి దిగారు. రేషన్‌కార్డుల జాబితాలో కూడా అనర్హులు ఉన్నారని గ్రామస్థులు ఆరోపించడంతో అధికారులు సమావేశం నుంచి వెళ్లిపోయారు.

గ్రామసభల్లో నిలదీతలు

(5వ పేజీ తరువాయి)

విధి, విధానాలు విడుదలచేసింది. పథకాల వారీగా జాబితాలు కూడా రూపొందించింది. జాబితాలో ఉన్న వారీ పేర్లను గ్రామసభల్లో చదివి వినిపిస్తున్నారు. దీంతో తమకు కాకుండా వేరే వారి పేరు ఎలా వచ్చిందని పలు గ్రామాల్లో ప్రజలు అధికారులను నిలదీస్తున్నారు. ప్రభుత్వం అమలు చేయనున్న నాలుగు సంక్షేమ పథకాలకు ఈ నెల 16నుంచి 20వరకు అధికారులు సర్వే నిర్వహించారు. ఉపాధి హామీ పథకంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో 20కి మించి పనుల్లో పాల్గొన్న కూలీలను ఆత్మీయ భరోసా పథకం కింద ఎంపిక చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 16,297మందిని అర్హులుగా ప్రభుత్వం జాబితా పంపింది. కొత్త రేషన్‌కార్డుల కోసం ప్రతిపాదిత జాబితాలో 70,781మందిని, అదనంగా చేరికల కోసం 43,620మంది ఎంపిక చేశారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం ఇంటి స్థలం ఉన్నవారిని 56,964మందిని గుర్తించారు. నాలుగు పథకాల కింద అర్హులైన వారి ప్రాథమిక జాబితాను రూపొందించారు. వీటిని గ్రామ సభలో చదివి విన్పిస్తున్నారు. అయితే దరఖాస్తు చేసుకున్నా జాబితాలో పేర్లు లేవని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో అర్హులైన ప్రతీ ఒక్కరు మరోసారి దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ఎం.హనుమంతరావు స్పష్టం చేశారు.

ఆర్టీసీకి 'సంక్రాంతి' ఆదాయం రూ.2.50కోట్లు

నల్లగొండ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా ఆర్టీసీ ఈ నెల 9 నుంచి 20వ తేదీ వరకు ఉమ్మడి నల్లగొండ జిల్లాతో పాటు హైదరాబాద్, ఇతర జిల్లాలకు పక్క రాష్ట్రాలకు బస్సులను నడపడం వల్ల అదనంగా రూ.2కోట్ల50లక్షల73వేల ఆదాయం సమకూరింది. మొత్తం 995 బస్సులను 3.84లక్షల కిలోమీటర్లు నడిపారు. దీంతో అదనపు ఆదాయం పెద్ద ఎత్తున చేకూరింది. 12 రోజుల్లోనే ఆదాయం అధికంగా రావడంతో సంస్థకు ప్రయోజనం చేకూరింది. ప్రతిరోజూ వచ్చే ఆదాయానికి అదనంగా ఆదాయం వచ్చింది.

రేపటి నుంచి ఉమ్మడి జిల్లా క్రీడా పోటీలు

నాగార్జునసాగర్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ పైలాన్ కాలనీలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 23, 24వ తేదీల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లా పాలిటెక్నిక్ కళాశాలల క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఐలయ్య తెలిపారు. కళాశాలలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలలకు చెందన విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి పోటీలను ప్రారంభిస్తారని తెలిపారు.

మోటారు వైర్ల చోరీ నిందితుడి అరెస్టు

నార్కట్‌పల్లి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ బావుల వద్ద మోటారు వైర్ల చోరీకి పాల్పడుతున్న వ్యక్తిని మంగళవారం అరెస్టు చేసినట్లు నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి ఎస్ఐ-2 నర్సిరెడ్డి తెలిపారు. సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం గోరెంట్లతండా గ్రామానికి చెందిన లావుడ్య తిరుమలేశ్ ప్రస్తుతం హయతనగర్ లో నివాసముంటున్నాడు. జల్సాలకు అలవాటుపడి డబ్బు కోసం స్నేహితులు సైదా, శ్రీనుల సహాయంతో ఎలక్ట్రికల్ వైర్ల దొంగతనానికి అలవాటుపడ్డాడు. ముందుగా పగటిపూట రెక్కీ నిర్వహించి దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఇందులో భాగంగానే ఈ నెల 15న మునుగోడు రోడ్డులోని సామ కొండల్‌రెడ్డి వ్యవసాయబావి వద్ద ఉన్న మోటారు వైరును చోరీ చేయడానికి కూడా ప్రయత్నించాడు. కాగా ఎస్పీ ఆదేశాలతో నల్లగొండ డీఎస్పీ పర్యవేక్షణలో దర్యాప్తు చేస్తుండగానే పక్కా సమాచారం మేరకు మంగళవారం ఉదయం నార్కట్‌పల్లి బస్‌స్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న లావుడ్య తిరుమలేష్‌ను పట్టుకుని విచారించగా నేరం ఒప్పుకోవడంతో అరెస్టు చేశామన్నారు. కాగా నిందితుడిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన నార్కట్‌పల్లి సీఐ నాగరాజు, ఎస్ఐ దగ్గుల క్రాంతికుమార్, ఏఎస్ఐ ఆంజనేయులు, హెచ్‌సీ రాము, పీసీలు శివశంకర్, తిరుమల్, సత్యనారాయణ, అఖిల్, మహేశ్, సాయి కుమార్‌లను ఎస్పీ అభినందించారని పేర్కొన్నారు.

క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు

భువనగిరి అర్బన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, లక్ష్మీనరసింహుడికి నిత్య కల్యాణం, నిత్యార్చనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. కొండపైన విష్ణుపుష్కరిణి వద్ద ఆంజనేయస్వామికి ఆలయంలో అర్చకులు వేద మంత్ర పఠనాలతో పంచామృతాభిషేకం చేసిన అర్చకులు తమలపాకులు, సింధూరం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఆంజనేయుడికి సహస్రనామ పఠనాలతో నాగవల్లీ దళార్చనలు నిర్వహించి హారతి ఇచ్చారు. ప్రధానాలయంలో స్వయంభువులను సుప్రభాత సేవలతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు, ముఖమండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలను పాంచారాత్రగమశాస్త్రరీతిలో నిర్వహించారు. శివాలయంలో పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి ముఖ మండపంలోని స్పటిక మూర్తులకు నిత్య పూజలు, నిత్య రుద్రహవనం శైవాగమన పద్దతిలో కొనసాగాయి. పాతగుట్ట ఆలయంలో ఆంజనేయస్వామిని పంచామృతాలతో అభిషేకించి ఆకుపూజ చేపట్టారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ. 36,14,101ల ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు. కాగా, స్వామివారి గిరిప్రదక్షిణ మహోత్సవంలో తెల్లవారుజామున 5గంటలకు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వైకుంఠ ద్వారం నుంచి ప్రదక్షిణ పూర్తి చేసుకొని గర్భాలయంలో స్వయంభువులకు ప్రత్యేక పూజల అనంతరం భువనగిరి శివారులోని బీఆర్ఎస్ కార్యాలయంలో ప్రెస్‌మీట్ నిర్వహించనున్నారు.



గర్భాలయంలో ఉత్సవమూర్తులకు పూజలు చేస్తున్న అర్చకుడు

మాజీ సర్పంచ్‌పై హత్యాయత్నం

శాలిగౌరారం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలంలోని ఉప్పలంచ గ్రామ మాజీ సర్పంచ్‌పై మంగళవారం హత్యాయత్నం జరిగింది. ప్రత్యర్థులు ఆయనపై కత్తులతో దాడి చేసి పరారయ్యారు. భూ తగాదాలే ఇందుకు కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ బండారు మల్లయ్య మంగళవారం ఉదయం ఎనిమిది గంటల సమయంలో మూసీ నది ఒడ్డున తన వ్యవసాయ పొలం వద్ద ఉండగా గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి కత్తులతో దాడి చేసి పారిపోయారు. చుట్టు పక్కల రైతులు గమనించి 108కు ఫోన్ చేశారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న మల్లయ్యను ట్రాక్టర్‌పై రామాంజీపురం వరకు తీసుకెళ్లారు. గ్రామం వరకు రాగానే 108 అంబులెన్స్ అక్కడికి చేరుకోవడంతో చికిత్స నిమిత్తం మొదట నార్కట్‌పల్లిలోని కామినేనికి ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడినుంచి హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం మల్లయ్య పరిస్థితి విషమంగా ఉంది. రాజకీయంగా లేదా భూతగాల నేపథ్యంతో మల్లయ్యపై దాడి చేశారా అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. ప్రస్తుతం గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు.





సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, చికిత్స పొందుతున్న మల్లయ్య

● తన భర్త బండారు మల్లయ్యపై గ్రామానికి రుద్రారపు యాదగిరి, మల్లయ్య, చిన్న యాదగిరిలు కత్తులతో దాడి చేసి చంపేందుకు ప్రయత్నం చేశారని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మల్లయ్య భార్య చంద్రలీల శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డికి ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ సైదులు విలేకరులకు తెలిపారు. గ్రామంలో నిర్మిస్తున్న పాపమ్మ గుడి నిర్మాణం స్థలం విషయంలో గొడవలు జరుగుతున్నాయని, దానిని దృష్టిలో ఉంచుకొని రుద్రారపు యాదగిరి, మల్లయ్య, చిన్న యాదగిరిలు తన భర్తను చంపేందుకే ప్రయత్నించారని ఆరోపించారు.

రాజకీయ కక్షలకు నిలయం ఉప్పలంచ

ఉప్పలంచ గ్రామం రాజకీయ కక్షలకు నిలయంగా ఉంది. హత్యలతో గ్రామ ప్రజలు కొన్నాళ్ల పాటు ఊరు వదిలివెళ్లిపోయారు. కొందరు వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. కాంగ్రెస్ నాయకుడు సంగపాక నర్సయ్యను 1989లో ఒక వర్గానికి చెందిన వారు హత్య చేశారు. దీనికి ప్రతీకారంగా అప్పటి సర్పంచ్ లూర్థయ్యను 1990లో కాంగ్రెస్ నాయకుడు గార్లపాటి అనంతరెడ్డి అనుచరులు హత్య చేశారు. 2000 సంవత్సరం నవంబరులో అనంత రెడ్డి హత్యకు గురయ్యారు. ఇప్పుడు మల్లయ్యపై హత్యాయత్నం జరగడంతో గ్రామస్థులు భయం గుప్పిట్లో ఉన్నారు.

అడవి సృష్టికర్తకు అవార్డు

● దుశ్చర్ల సత్యనారాయణకు గవర్నర్ ప్రతిభా పురస్కారం ● 70 ఎకరాల్లో అడవిని సృష్టించిన వన ప్రేమికుడు



తాను పెంచిన అడవిలో దుశ్చర్ల సత్యనారాయణ

మోతె, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మోతె మండలం రాఘవాపురం గ్రామానికి చెందిన పర్యావరణ పరిరక్షణవేత్త, జలసాధన సమితి జాతీయ అధ్యక్షుడు దుశర్ల సత్యనారాయణ గవర్నర్ ప్రతిభా పురస్కారానికి ఎంపికయ్యారు. వివిధ రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఆరుగురిని రాజ్‌భవన్ వర్గాలు ఎంపిక చేయగా, వారిలో సత్యనారాయణ ఒకరు. తల్లిదండ్రుల నుంచి వారసత్వంగా తనకు దక్కిన 70ఎకరాల్లో దుశ్చర్ల సత్యనారాయణ అడవిని సృష్టించడంతో పాటు అందులో వివిధ రకాల పక్షులను, మొక్కలను పెంచారు. ఈ నెల 26న రాజ్‌భవన్‌లో నిర్వహించే గణతంత్ర దినోత్సవనంలో దుశర్ల సత్యనారాయణకు తెలంగాణ గవర్నర్-2024 అవార్డ్ ఫర్ ఎక్స్‌లెన్స్‌తో పాటు రూ.2లక్షల నగదును గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అం దజేస్తారు. ఈ సందర్భంగా దుశ్చర్ల సత్య నారాయణ మాట్లాడుతూ ఈ అవార్డు ఎంపికతో తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు.

అడవి సృష్టించారిలా..

బ్యాంకు ఉద్యోగి అయిన దుశ్చర్ల సత్యనారాయణ నల్లగొండ జిల్లాలో ఫ్లోరైడ్ సమస్యపై గళమెత్తారు. ఈ తరుణంలో ఆయన జలసాధన సమితిని ఏర్పాటు చేశారు. ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొంటున్న సమయంలో 30ఏళ్ల క్రితమే బ్యాంకు ఉద్యోగానికి స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. తల్లిదండ్రుల నుంచి వారసత్వంగా వచ్చిన 70ఎకరాల భూమిలో దుశ్చర్ల సత్యనారాయణ అడవిని సృష్టించారు. 25సంవత్సరాలుగా దానిని సంరక్షిస్తున్నారు. వేసవిలో నీరు, ఆహారం దొరక్క జంతువులు, పక్షులను కాపాడేందుకు కంకణం కట్టుకున్నారు. అడవిలో లక్షల సంఖ్యలో చెట్లు ఉన్నాయి. అవి మహా వృక్షాలయ్యాయి. వేల సంఖ్యలో వివిధ రకాల పక్షులు అక్కడ స్వేచ్ఛగా తిరుగుతుంటాయి. అందులో రెండు చెరువులు ఉన్నాయి. బోర్లు వేసి 24గంటలు నీరందిస్తుంటారు. నిరంతరం పక్షులకు ఆహారం అందిస్తున్న ఆయనకు పర్యావరణ వేత్తలు సహకారం అందిస్తుంటారు. దుశ్చర్ల సత్యనారాయణ కుమారుడు హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నారు. అడవిని చూసుకునేందుకు ఓ కుటుంబాన్ని నియమించి కాపాడుకుంటున్నారు.



రాఘవాపురం గ్రామంలోని 70 ఎకరాల అడవిలో దుశ్చర్ల

అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు

● సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపికకు గ్రామ సభలు ప్రారంభం ● నకిరేకల్ శాలిగౌరారం మండలాల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు వీరేశం, సామేలు


నకిరేకల్ : ఓగోడు గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల వీరేశం


శాలిగౌరారం : చిత్తలూరు గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేలు

నకిరేకల్, కేతేపల్లి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలను అందిస్తామని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. ఈ నెల 26నుంచి అమలు కానున్న ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలకు అర్హులను ఎంపిక చేయడం కోసం మంగళవారం నకిరేకల్ మండలం ఓగోడు, నడిగూడెం, నోముల, నకిరేకల్, కేతేపల్లిలో నిర్వహించిన గ్రామసభల్లో ఆయన మాట్లాడారు. ఎన్ని కల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఎవ్వరికి రేషన్‌కార్డులు ఇవ్వలేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభ ుత్వం వచ్చిన తర్వాతనే పేదలకు సరైన న్యాయం జరుగుతుందన్నారు. ఆయా కార్యక్రమాల్లో నకిరేకల్ మున్సిపల్ చైర్‌పర్సన్ చెవుగోని రజితాశ్రీనివాస్, ఎంపీడీవో చంద్రశేఖర్, తహసీల్దార్ జమీరొద్దీన్,మున్సిపల్ కమిషనర్ బాలయ్య, కౌన్సిలర్లు గాజుల సుకన్య శ్రీనివాస్, ఘర్షకోటి సైదులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ దూలం సోములు, పీఏసీఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటే శ్వర్‌రావు పాల్గొన్నారు. పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్, మండల ప్రత్యేక అధికారి జె.హరీష్, నకిరేకల్ మార్కెట్ చైర్‌పర్సన్ గుత్తా మంజుల, తహసీల్దార్ ఎస్. మధుసూదన్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్లు బయ్య ముత్తయ్య, పర్శయ్య, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కె.శ్రీనివాసయాదవ్, కాంగ్రెస్, సీపీఎం నాయకులు జి.మాధవరెడ్డి, బొజ్జ సుందర్, కోట పుల్లయ్య పాల్గొన్నారు. అలాగే కేతేపల్లి మం డలం భీమారం, బండపాలెం, ఇప్పలగూడెం, కేతేపల్లి గ్రామాల్లో మంగళవారం అధికారులు గ్రామసభలు నిర్వహించారు. భీమారంలో ఎంపీడీవో బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయా గ్రామసభల్లో తహసీల్దార్ ఎన్.మధుసూదన్‌రెడ్డి, ఏవో బి.పురుషోత్తం, ఎంపీవో నాగలక్ష్మి, ఆర్ఐ ఛాంద్‌పాషా పాల్గొన్నారు.

● శాలిగౌరారం (ఆంధ్రజ్యోతి): ప్రజా పాలనలోనే నిజమైన పేద ప్రజలకు పథకాలు అందుతాయని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. మండలంలోని చిత్తలూరు, వంగమర్తి గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన గ్రామసభల్లో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ పథకాల లిస్టులో పేరు లేదని ఆందోళన చెందవద్దన్నారు.ఈ గ్రామసభలో దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేస్తామన్నారు. అధికారులు, సిబ్బంది లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి, మండల ప్రత్యేకాధికారి మాన్యానాయక్, తహసీల్దార్ పి.యాదగిరి, ఎంపీడీవో బానోతు సుధాకర్, ఏవో సౌమ్య శృతి, ఎంపీవో అల్లూరి పద్మ, ఆర్ఐ అజారుద్దీన్, బెల్లి వీరభద్రం, రమేష్, రవి పాల్గొన్నారు.

● కట్టంగూరు, (ఆంధ్రజ్యోతి): మండలంలోని కురుమర్తి గ్రామసభలో జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. పిట్టంపల్లి గ్రామసభలో మండల ప్రత్యేకాధికారి కోటేశ్వర్‌రావు పాల్గొని మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందుతాయని తెలిపారు. అలాగే మండలంలోని నల్లగుంటబోలు, నారేగూడెం, బాస్కర్లబాయి, ఇస్మాయిపల్లి, పిట్టంపల్లి, కురుమర్తి గ్రామాల్లో అధికారులు గ్రామ సభలను నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గుగు లోతు ప్రసాద్, ఎంపీడీవో పెరుమాళ్ల జ్ఞానప్రకాశ్‌రావు, ఎంఏవో గిరిప్రసాద్, ఎంఈవో అంబటి అంజయ్య, డీటీ సుకన్య, ఎంపీవో చలపతి ఉన్నారు.

● తిప్పర్తి, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పజ్జూరు, అనిశెట్టి దుప్పలపల్లి, మామిడాల, వెంకటాద్రిపాలెం, తానేదార్‌పల్లి, జొన్నగడ్డలగూడెం గ్రామాల్లో అధికారులు సభలు నిర్వహించారు. కాగా, బుడారం జంగారెడ్డిగూడెం, అంతయ్యగూడెం, రాములింగాలగూడెం, రాయినిగూడెం, గోదారిగూడెం, సిలార్‌మియాగూడెం గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించనున్న ఎంపీడీవో వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు.

● చిట్యాల,(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 3వ వార్డులో నిర్వహించిన వార్డు సభలో మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడారు. ఆరు గ్యారంటీలతో పాటు ఇచ్చిన అన్ని హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఈ సందర్భంగా సభలో దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కోనేటి కృష్ణ, జమాండ్ల జయమ్మ, బెల్లి సత్తయ్య, కమిషనర్ వీరేందర్ నాయకులు ఎస్‌కే ఇబ్రహీం, కోనేటి ఎల్లయ్య పాల్గొన్నారు.

● చండూరు రూరల్, (ఆంధ్రజ్యోతి):మండలంలోని బంగారిగడ్డ గ్రామసభలో మండల ప్రత్యేకాధికారి రామకృష్ణ, ఎంపీడీవో రాంరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు ఇందిరమ్మ ఇళ్ల ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల జాబితాలను చదివి వినిపించారు. అలాగే పుల్లెంలలో తహసీల్దార్ దశరథ, గొల్లగూడెంలో ఏవో చంద్రిక, జోగిగూడెంలో ఎంపీవో మాధవరెడ్డి ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించి అర్హుల జాబితాని చదివి వినిపించారు. కొత్త దరఖాస్తులను స్వీకరించారు.

● మునుగోడు రూరల్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలివెల, చీకటిమామిడి, ఇప్పర్తి, కిష్టాపురం, కొరటికల్, కొంపల్లి గ్రామాల్లో మంగళవారం గ్రామసభలు నిర్వహించారు. పలివెల గ్రామసభలో జిల్లా పంచాయతీ అధికారి మండల ప్రత్యేక అధికారి వెంకయ్య పాల్గొని మాట్లాడుతూ సంక్షేమ పథకాలను ప్రజలకు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. సమావేశాల్లో తహసీల్దార్ నరేందర్, సూపరింటెండెంట్ విజయ్ భాస్కర్, ఎంపీవో విజయలక్ష్మి, తాజా మాజీ సర్పంచులు ఎంపీటీసీలు వార్డు సభ్యులు పాల్గొన్నారు.


కట్టంగూరు: కురుమర్తి గ్రామ సభలో మాట్లాడుతున్న జడ్పీసీఈవో ప్రేమ్‌కరణ్ రెడ్డి


చిట్యాల : 3వ వార్డు సభలో దరఖాస్తు స్వీకరిస్తున్న మున్సిపల్ చైర్మన్ వెంకటరెడ్డి

ఎల్‌వోసీ అందజేత

కేతేపల్లి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కేతేపల్లికి చెందిన అవ్వారి ఆరోగ్యయ్యకు సీఎంఆర్ఎఫ్ నుంచి రూ..1.50 లక్షలు ఎల్‌వోసీ మంజూరైంది. ఈ మేరకు నకిరేకల్‌లోని తన నివాసంలో ఎమ్మెల్యే వేముల వీరేశం బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్లు, ముత్తయ్య, పర్శయ్య, కాంగ్రెస్ నాయకులు ఎ.కిరణ్, ఎ.వెంకట్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

యంగ్ ఇండియా బోలో పోస్టర్ ఆవిష్కరణ

నార్కట్‌పల్లి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ ఆధ్వర్యంలో నిర్వహించే యంగ్ ఇండియాకే బోలో సీజన్-5 కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను మంగళవారం నార్కట్‌పల్లిలో యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జిల్ల పృథ్వీరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుగుడు రవి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా పృథ్వీరాజ్, తిరుగుడు రవి, మాదాసు విజయ్, షరీఫ్, మేడి రమేశ్, మేడ బోయిన అభి, మనోజ్ కుమార్, శివశంకర్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

● నార్కట్‌పల్లి, (ఆంధ్రజ్యోతి): పేదలకు రేషన్‌కార్డులు ఇవ్వలేని స్థితిలో ప్రభుత్వం ఉందని బీజేపీ మండలాధ్యక్షుడు కొర్వి శంకర్ మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. మండ లంలో మొత్తం 8000 మంది రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకోగా కేవలం వెయ్యి లోపు ఇచ్చిందని విమర్శించారు.

● ఉపాధ్యాయ స్పౌజ్ కుటుంబాలకు మేలు కలిగేలా బదిలీలకు అనుమతి ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి పీఆర్‌టీయూ టీజీ జిల్లా అధ్యక్షుడు చిలుముల బాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కొడదల శంకర్ మంగళవారం ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. పీఆర్‌టయూటీజీ రాష్ట్ర అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి సీఎంతో చర్చించి రాష్ట్ర వ్యాప్తంగా 834 మంది ఉపాధ్యాయులను బదిలీ చేయించారని పేర్కొన్నారు.

●నాగార్జునసాగర్(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ పట్టాలు పంపిణీ చేస్తామని అదనపు కలెక్టర్ శ్రీనివాస్, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన విజయ విహార్‌లో తిరుమ లగిరి (సాగర్) మండలంలో చేపట్టిన పైలట్ ప్రాజెక్టుపై సమీక్షా సమావేశం నిర్వహించారు.

● మిర్యాలగూడ, (ఆంధ్రజ్యోతి): మోదీ మూడోసారి అధికారంలోకి వచ్చి వ్యవసాయ రంగాన్ని మరింత సంక్షోభానికి గురిచేశారని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జూలకంటి రంగారెడ్డి అన్నారు. ఇటీవల కోల్‌కతాలో నిర్వహించిన అఖిల భారత కిసాన్ సభ సమావేశాల్లో ఆయన మాట్లాడారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

నార్కట్‌పల్లి, జనవరి21 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురుకులానికి సంబ ంధిం చిన స్టడీ మెటీరియల్స్‌ను ఆసరా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు మేడి హరికృష్ణ మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భారతి, ఉపాధ్యాయులు భాను, జయమ్మ, వెంకట్ రెడ్డి, విజయలక్ష్మి, స్వప్న, మేడి నర్సింహ, బొప్పని లవకుమార్ పాల్గొన్నారు.

నేడు ఎమ్మార్పీఎస్ సభ

కనగల్, జనవరి 21(ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కనగల్ ఎక్స్‌రోడ్డులో బుధవారం నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ సంఘం జాతీయ నాయకుడు కందుల మోహన్ మాదిగ, మండలాధ్యక్షుడు దుబ్బ సత్యనారాయణ కోరారు. కనగల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బహిరంగ సభకు కాంగ్రెస్ నాయకుడు, గాయకుడు ఏపూరి సోమన్న హాజరు కానున్నట్లు వివరించారు. ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు ఇంటికొక్కరూ చొప్పున డప్పుతో సభకు తరలిరావాలని సూచించారు. అలాగే ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించ నున్న లక్షడప్పులు వెయ్యి గొంతుకల బహిరంగ సభకు కార్యకర్తలు సన్నద్ధం కావాలని సూచించారు. సమావేశంలో దుబ్బ దేవేందర్, ఎర్రోళ్ల శ్రీను పాల్గొన్నారు.

'ఆత్మీయ భరోసా' అమలు చేయాలి

మర్రిగూడ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా చరగూడ ముంపు బాధితులకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అమలు చేయాలని కోరుతూ బాధితులు రాంరెడ్డిపల్లిలో మంగళవారం నిర్వహించిన గ్రామసభలో అధికారి అయిన హేమలతకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బక్క శ్రీనివాస్, ఎంపీవో రవికుమార్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ నాయక్, విజయ్ కుమార్, యూసుఫ్, ప్రజలు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

మర్రిగూడ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివన్నగూడెంలో లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నిధుల నుంచి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేశారు. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. రైతుల కోరిక మేరకు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేశారు.

హామీలను అమలుచేయాలి : ఎల్‌హెచ్‌పీఎస్


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు

నల్లగొండ, జనవరి 21(ఆంధ్రజ్యోతి): కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు గిరిజనులకు ఇచ్చిన హామీ లను అమలుచేయాలని లంబాడ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు సక్రూనాయక్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో మంగళవారం నిర్వహించిన ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఉన్న 18 కోట్ల లంబాడిలు మాట్లాడే గోర్‌బాలి భాషను మాతృభాషగా గుర్తించేందుకు భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 8 ఏను సవరించాలన్నారు. అనంతరం నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు రమావత్ దావోజి నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ సురేందర్‌నాయక్, ప్రధాన కార్యదర్శి శ్రీనునాయక్, మహిళా అధ్యక్షురాలు దేవి, కిషన్ నాయక్, రమేష్ నాయక్, రవినాయక్ పాల్గొన్నారు.

శిలాఫలకం ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి


ధ్వంసం చేసిన శిలాఫలకాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

కట్టంగూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అయిటిపాముల గ్రామంలో లిఫ్ట్ ఇరిగేషన్ వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య డిమాండ్ చేశారు. మంగళవారం రిజర్వాయర్ సమీపంలో లిఫ్ట్ ఇరిగేషన్ కోసం ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. దాంతో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య స్థానిక బీఆర్ఎస్ నాయకులు, రైతులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. అనంతరం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తరాల బలరాములు యాదవ్, బీఆర్ఎస్ నాయకులు పోగుల నర్సింహ, వడ్డె సైదిరెడ్డి, పెద్ది బాల నర్సింహ, నల్లమాద సైదులు, బెల్లి సుధాకర్, మంగదుడ్ల వెంకన్న, ఎడ్ల చిన్నరాములు, నంద్యాల నర్సిరెడ్డి, బోడ యాదగిరి, పురుషోత్తంరెడ్డి, రవి ఉన్నారు.

ఉపాధ్యాయుడిపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి


బంగారిగడ్డ పాఠశాలలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

చండూరురూరల్, జనవరి21 (ఆంధ్రజ్యోతి) : తుక్కుగూడ జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు రాములుపై మూకదాడికి పాల్ప డిన ఉన్మాదులను వెంటనే అరెస్టు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ మండల నాయకులు డి మాండ్ చేశారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులకు రక్షణ కల్పించాలని ఉపాధ్యాయ సంఘాల పిలుపు మేరకు మంగళవారం మండలంలోని బంగారిగడ్డ, బోడంగిపర్తి పాఠశాలల్లో మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సీహెచ్ రామ లింగయ్య మాట్లాడుతూ మూకదాడికి పాల్పడ్డ వ్యక్తులను నెల రోజులు గడుస్తున్నా అరె స్టు చేయకపోవడం అన్యాయమని, పాఠశాలల్లో ఉపాధ్యాయులకు రక్షణ లేకుండా పోతుందని వాపోయారు. కార్యక్రమంలో గంగాధర్,నర్సింహచారి నరేష్ పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాలి


అవగాహన కల్పిస్తున్న ఎంఈవో అరుంధతి

నల్లగొండ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : డ్రగ్స్ రహిత సమాజం కోసం వ్యాయామ ఉపాధ్యాయులు కృషి చేయాలని నల్లగొండ ఎంఈవో కత్తుల అరుంధతి కోరారు. జిల్లా కేంద్రంలోని డీవీఎం, బీఎడ్ కళాశాలలో మాదక ద్రవ్యాల వ్యతిరేకకమిటీల ప్రాముఖ్యతపై జిల్లాలోని ఉన్నత పాఠశాలల వ్యాయామ ఉధ్యాయులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడారు. మాదక ద్రవ్యాల వాడకాన్ని అరికట్టాలని పిలుపు నిచ్చారు. కొందరు విద్యార్థుల్లో వింతపవర్తన కనిపిస్తే వారిని గుర్తించి తగు కారణాలు తెలుసుకోనుటకు ప్రతి పాఠశాలలో యాంటి డ్రగ్స్ కమిటీలు వెంటనే జాగ్రత్తలు చేపట్టాలన్నారు. డాక్టర్ సైక్రియాటిస్టు విజయ్‌కుమార్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగంలో ఉన్న వ్యక్తుల ప్రవర్తనలో దూకుడు, ఒత్తిడి, ఒంటరితనం, ఆందోళన, చికాకు, నిద్రలేమి లక్షణాలు ఉంటారని అన్నారు. కార్యక్రమంలో సీఐ కె. శివశంకర్, జిల్లా సైన్స్ అధికారి వనం లక్ష్మీపతి, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ విమల, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐకేపీ శాలిగౌరారం ఏపీఎంగా రాములు



శాలిగౌరారం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఐకేపీ శాలిగౌరారం మండల ఏపీఎంగా ధర్మ బోయిన రాములు మంగళవారం బాధ్య తలు స్వీకరించారు. ఇక్కడ ఏపీఎంగా పనిచేసిన జానకి నల్లగొండకు బదిలీపై వెళ్లారు. నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లో పనిచేసిన రాములు ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ సమభావన సంఘాల బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

ఎదురింటికి వెళ్లాలంటే 3 కిలోమీటర్ల ప్రయాస

● 12వ బెటాలియన్ ఎదుట యూ టర్న్ మూసివేత ● ఇబ్బందులు పడుతున్న దాసరిగూడెం గ్రామస్థులు

దాసరిగూడెం వాసులు ఎదురుగా ఉన్న ఇంటికి కాలినడకన వెళ్ల లేక బైక్‌పైనో...లేదా కారులోనో వెళ్లాలనుకుంటే కనీసం 3 కి.మీలు తిరిగి రావాల్సిన పరిస్థితి ఏర్పడింది.

నార్కట్‌పల్లి (ఆంధ్రజ్యోతి)


బెటాలియన్ ఎదుట మూసివేసిన యూటర్న్

మండలంలోని దాసరిగూడెం స్టేజీ సమీపంలో ఉన్న 12వ బెటాలియన్ ఎదురుగా ఉన్న 'యూటర్న్'ను ఇటీవల అధి కారులు మూసేశారు. ఆ యూటర్న్ వద్ద ఏమైనా భారీ ప్రమాదాలతో ప్రాణ నష్టం జరిగిందా అంటే అదీ లేదు. ఇటీవల బెటాలియన్‌లో పనిచేస్తున్న ప్రత్యేక కానిస్టేబుల్‌లకు సెలవులు ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ వారి కుటుంబ సభ్యులు ఆందోళన చేసిన తర్వాతే జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు యూ టర్న్ మూసివేశారని దాసరి గూడెం గ్రామస్తులు చెబుతున్నారు.

సీతారాంపురం వద్ద యూటర్న్

దాసరిగూడెం గ్రామస్తులు బైక్‌పై లేదా కారులోనే నార్కట్‌పల్లి వైపునకు రావాలన్నా లేదా కనీసం బెటాలియన్ పక్కనే ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయానికో లేక చర్చి, మసీదుకో, బ్యాంకుకో వెళ్లాలనుకున్నా నల్లగొండ వైపుకు వెళ్లి సీతారాంపురం స్టేజీ వద్ద ఉన్న 'యూటర్న్' చేసుకుని 3 కి.మీలు అదనంగా తిరగాల్సి వస్తుంది. అదేవిధంగా నల్లగొండ నుంచి దాసరిగూడేనికి వచ్చే గ్రామస్థులు ఎంజీయూ ఎదురుగా ఉన్న యూటర్న్ వరకు వెళ్లి తిరిగి నల్లగొండ వైపునకు వస్తూ అదనంగా 2 కి.మీలు ప్రయా ణించాల్సి రావడంతో ఇబ్బంది పడుతున్నారు.

యూటర్న్‌ను తెరిపించండి

అన్నెపర్తి 12వ బెటాలియన్ ఎదురుగా ఉన్న యూటర్న్‌ను ఎందుకు మూసివేశారో అర్థం కావడం లేదు. బెటాలియన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుళ్లకు సెలవులు ఇవ్వక పోవడంతో కుటుంబ సభ్యులు ధర్నా చేసిన అనంతరం యూటర్న్ మూసేశారు. ధర్నాకు యూటర్న్ మూసివేయడానికి సంబంధమేమిటో తెలియడం లేదు. కానీ మేం మాత్రం ఎదురుగా ఉన్న బ్యాంకుకు, గుడికి వెళ్లాలన్నా 3 కి.మీలు తిరగాల్సి వస్తుంది. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని మూసిన యూటర్న్‌ను తెరవాలి. -ఉప్పల రవీందర్‌రెడ్డి

పాత పెన్షన్ విధానాన్నే కొనసాగించాలి

మిర్యాలగూడ, జనవరి 21(ఆంధ్రజ్యోతి): సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని నల్లగొండ, వరంగల్, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పన్నాల గోపాల్‌రెడ్డి డిమాండ్‌చేశారు. మంగళవారం స్థానికంగా ఉపాధ్యాయులు, అధ్యాపకులను కలిసి ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. గోపాల్‌రెడ్డికి సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు టీజేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుండెబోయిన నాగేశ్వరరావు తెలిపారు. సమావేశంలో క్రాంతి కుమార్, సత్యప్రకాశ్ నాయుడు, పి.జానయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల కబ్జాపై మొక్కుబడి కార్యాచరణ


ఇందిరమ్మ కాలనీని వెంచరు

నార్కట్‌పల్లి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాలు, భూములను కాపాడే బాధ్యత అధికారులదేనని ఎమ్మెల్యే వేముల వీరేశం సరిగ్గా గతేడాది చేసిన ఆదేశించారు. అయితే ఆదేశాలు అమలులో సంబం ధిత అధికారులు కార్యాచరణ కరువైంది. గతేడాది జనవరిలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో అప్పటి ఎంపీటీసీలు పుల్లెంల ముత్తయ్య, పాశం శ్రీనివాస్‌రెడ్డి నార్కట్‌పల్లి పరిసరాల్లో ప్రభుత్వ స్థలాలు, భూములను రియల్టర్లు ఆక్రమించినా అధికారులు మీనమేషాలు లెక్కపెడుతున్నారు.

ఇవీ ఆరోపణలు

నార్కట్‌పల్లి పెద్ద చెర్వు ఎఫ్‌టీఎల్ పరిధికి వచ్చే భూమిలో ఓ వెంచరు రోడ్డు వేసిందని, బలహీన వర్గాల గృహ కాలనీ ఇందిరమ్మ కాలనీలో ఫేక్ సర్టిఫికెట్లు సృష్టించి ప్లాట్లు కేటాయిస్తున్నారని, సాయిప్రియనగర్ వెంచర్‌లో సామూహిక అవసరాల కోసం కేటాయించిన 10 శాతం భూమిని రియల్టర్లు స్వాధీనపర్చుకుని విక్రయించారని, సర్వే నంబర్ 550లో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని ఓ ప్రైవేటు కంపెనీ షెడ్డు నిర్మాణం చేసిందని ఇలా కొన్నింటిని ఎమ్మెల్యే దృష్టికి సభ ద్వారా తీసుకువచ్చారు.

ఇదీ ఎమ్మెల్యే ఆదేశం


భూ కబ్జా, ఆక్రమణల ఆరోపణలపై ఎమ్మెల్యే వేముల వీరేశం స్పందించారు. ప్రజాప్రతినిధుల సభ దృష్టికి తెచ్చిన భూ ఆక్రమణలను 3 నెలల్లో గా పరిష్కరించాలని ఐబీ, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కార్యా చర ణ తదుపరి తీసుకున్న చర్యలపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు.

ఇదే అధికారుల కార్యాచరణ

నార్కట్‌పల్లి పెద్ద చెర్వు ఎఫ్‌టీఎల్ పరిధిలో వెంచరు యాజమాన్యం వేసిన రోడ్డును రైతుల సౌలభ్యం కోసం వారి విజ్ఞప్తి మేరకు వేసేందుకు కలెక్టర్ అనుమతించడంతో వదిలేశారు. కాగా ఫేక్ సర్టిఫికెట్లతో స్థానిక ఇందిరమ్మ కాలనీలో ప్లాట్ల అక్రమ విక్రయాలపై క్షేత్ర స్థాయిలో విచారణ చేస్తామని చెప్పిన రెవెన్యూ అధికారులు నేటికీ ఆ పనిచేయలేదు. సాయిప్రియనగర్ వెంచరులో స్వాధీనం చేసుకోవాల్సిన 10 శాతం భూమిని ఎం.ఎడవల్లి గ్రామ పంచాయతీ నేటికీ స్వాధీనం చేసుకున్న దాఖలాలు లేవు. 550 సర్వే నెంబరు ప్రభుత్వ భూమిలో ఓ ప్రైవేటు కంపెనీ షెడ్డు నిర్మాణం చేపట్టిందన్న ఆరోపణలపై పూర్తిస్థాయి విచారణ చేయలేదు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నల్లగొండ

5 బుధవారం 22 జనవరి 2025

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 72

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.144	230	260
సూర్యాపేట	రూ.130	200	230
నల్లగొండ	రూ.130	200	230

ఉష్ణోగ్రత గరిష్ఠం 30.0 , కనిష్ఠం 16.4



పురావస్తు వైభవానికి చర్యలు

నామమాత్రం

చారిత్రక సాక్ష్యాలు శిలలు. వందల ఏళ్ల నాటి పరిస్థితులు, వైభవాన్ని చాటిచెప్పే శిలా సంపదకు ఉమ్మడి నల్లగొండ జిల్లా నెలవు. ఈ నేలలో ఆలయాలు, శాసనాలు, శిల్పాల రూపంలో ఎన్నో నిక్షిప్తమై ఉన్నాయి. బౌద్ధుల చరిత్రకు ఆనవాళ్లుగా నందికొండ, ఫణిగిరి, కొలనుపాక ఉండగా చారిత్రక శిలా సంపదను కొలమానంగా నిలిచే అద్భుత ఆలయాలు ఇక్కడే ఎన్నో ఉన్నాయి. వింత గొలిపే నల్లగొండ సమీపంలోని ఛాయాసోమేశ్వరాలయం, శిలా సంపదకు పిల్లలమర్రి మచ్చుతునకలు. చరిత్రకు నెలవుగా మారిన జిల్లాలో పురావస్తుశాఖ ప్రాంతీయ కార్యాలయం లేకపోవడంతో పురావస్తు సంపద రక్షణకు ఇబ్బందిగా మారింది. ఇటీవల పానగల్ ఛాయాసోమేశ్వరాలయాన్ని ప్రపంచ పురావస్తు సంపదగా గుర్తించేందుకు చేస్తామన్న ప్రయత్నాలు ఆదిలోనే నిలిచిపోయాయి. నల్లగొండలోని పురావస్తు మ్యూజియాన్ని ఆధునీకీకరించి, ఛాయాసోమేశ్వరాలయానికి ప్రపంచ వారసత్వ గుర్తింపు తేవాలన్న సూచనలు ఇటీవల వెల్లువెత్తుతున్నాయి.

•6లో..

● ఆంధ్రజ్యోతి ప్రతినిధి, నల్లగొండ



నల్లగొండ మునిసిపాలిటీలో ఘర్షణ పడుతున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలు

నీలగిరి మునిసిపాలిటీలో

రణరంగం



పోలీసులు అరెస్ట్ చేస్తుండటంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కంచర్ల

- వివాదానికి దారితీసిన బీఆర్ఎస్ ఫ్లెక్సీల తొలగింపు
- మునిసిపాలిటీలో ధర్నాకు దిగిన మాజీ ఎమ్మెల్యే కంచర్ల
- కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య ఘర్షణ
- ఫర్నీచర్, పూల కుండీలు ధ్వంసం, ఉద్రిక్తత
- బీఆర్ఎస్, కంచర్లపై మండిపడ్డ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, గుమ్ముల మోహన్‌రెడ్డి



నల్లగొండ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ మునిసిపల్ కార్యాలయం మంగళవారం రణరంగాన్ని తలపించింది. కాంగ్రెస్, బీఆర్ఎస్ నడుమ ఘర్షణ, తోపులాటలతో ఉద్రిక్తత కొనసాగింది. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన మహాధర్నాకు సంబంధించి పట్టణంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, హోర్డింగులను మున్సిపల్ సిబ్బంది తొలగించడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి నేతృత్వంలో శ్రేణులు మంగళవారం మునిసిపల్ కమిషనర్ ఛాంబర్ వద్ద ఆందోళనకు దిగాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ నడుమ ఘర్షణ చెలరేగి, మాజీ ఎమ్మెల్యేను పోలీసులు బలవంతంగా అరెస్ట్ చేసేంతవరకు వెళ్లింది.

రైతాంగ సమస్యలపై ఈనెల 21న నల్లగొండలో మహాధర్నాకు పార్టీ మిగతా 6వ పేజీలో...

గ్రామాల్లోకి వెళితే

కోమటిరెడ్డిపై తిరుగుబాటు

- మాజీ మంత్రి జగదీ‌ష్‌రెడ్డి

•6లో..





చిట్యాల మండలం ఎలికట్టెలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్థులు

గ్రామసభల్లో నిలదీతలు

- జాబితాలపై అధికారులతో వాగ్వాదాలు
- దరఖాస్తు చేసుకున్నా పేర్లు లేవు
- తొలి విడతలోనే సంక్షేమ పథకాలు పొందాలని అందరి తపన
- సభలకు తరలివచ్చిన ప్రజలు

నల్లగొండ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేయనున్న సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపికపై జిల్లా యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా మంగళవారం గ్రామసభలు ప్రారంభమయ్యాయి. ఈ సభల్లో అధికారులు, ప్రజల మధ్య వాగ్వాదాలు, నిలదీతలు, ప్రశ్నల పరంపర కొనసాగింది. ఆశావహులు అధికంగా ఉండటం, అర్హుల జాబితాలో పేర్లు కొన్నే ఉండటంతో పలు గ్రామాల్లో ఘర్షణ వాతావరణంలో సభలు కొనసాగాయి. కొన్ని చోట్ల పోలీసులు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. జిల్లాలోని నల్లగొండ, నకిరేకల్, మునుగోడు, దేవరకొండ, నాగార్జునసాగర్, మిర్యాలగూడ నియోజకవర్గాల్లో కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌తోపాటు పలువురు ప్రజాప్రతినిధులు ఈ గ్రామసభల్లో పాల్గొన్నారు. ఈ సభలో వారికి ప్రజల నుంచి పెద్ద సంఖ్యలో సవాళ్లు ఎదురయ్యాయి. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు తామే ముందుగా లబ్ధిపొందాలనే ఉద్దేశంతో ప్రజలు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా నిలదీతలు ఎదురవ్వగా అందరికీ పథకాలు వర్తిస్తాయని ప్రజాప్రతినిధులు, అధికారులు వారిని సముదాయించారు. జాబితో పేరులేని వారి కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుచేసి అధికారులు దరఖాస్తు తీసుకున్నారు. ఈ దరఖాస్తులను పరిశీలించి పథకాలు వర్తింపజేస్తామని అధికారులు గ్రామస్థులను సముదాయించి సభలను తొలిరోజు ముగించారు.

ప్రభుత్వం ఈ నెల 26వ తేదీ నుంచి అమలుచేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులకు లబ్ధిదారుల ఎంపిక కోసం మంగళవారం జిల్లా వ్యాప్తంగా గ్రామసభలు కొనసాగాయి. ప్రభుత్వం ముందుగానే కొందరు అర్హులతో అధికారులకు జాబితాలు పంపగా వాటిని గ్రామసభల్లో చదివి వినిపించారు. అయితే సంక్షేమ పథకాలకు గతంలో 'ప్రజాపాలన' సందర్భంగా దరఖాస్తు చేసుకున్నా, పలువురి పేర్లు ఈ జాబితాల్లో లేకపోవడంవతో అధికారులను ప్రజలు నిలదీశారు. సంక్షేమ పథకం కోసం దరఖాస్తు చేసుకున్నా జాబితాలో పేరు ఎందుకు లేదని ప్రశ్నించారు. సంక్షేమ పథకాల అమలుకు సర్వే అనంతరం చేపట్టిన గ్రామసభల్లో జనం నుంచి అధికార యంత్రాంగానికి ఊహించని విధంగా ప్రశ్నలు ఎదురయ్యాయి.

జిల్లాలో మొత్తం 844 గ్రామపంచాయతీలు, ఎనిమిది మునిసిపాలిటీలు ఉన్నాయి. కాగా, అధికారులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి సభలు నిర్వహించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా తదితర పథకాలకు ఈ నెలాఖరు వరకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేయాలని యంత్రాంగం చూస్తోంది. ప్రభుత్వం ఇప్పటికే మార్గదర్శకాలు, మిగతా 7వ పేజీలో...

జిల్లాలో తొలిరోజు ఇలా...

గ్రామసభలు	:	223
వార్డుసభలు	:	48

దరఖాస్తులు ఇలా...

రేషన్‌కార్డు	:	10,500
ఇందిరమ్మ ఇళ్లు	:	8,029

కనీస వేతనం అమలు చేయాలి

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి



ఆశాల పాదయాత్రను ప్రారంభిస్తున్న తుమ్మల వీరారెడ్డి

నల్లగొండ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఆశావర్కర్లకు రూ.18వేల కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం రాష్ట్ర ఆశా వర్కర్స్ యూనియన్ పిలుపు మేరకు 10కిలోమీటర్ల పాదయాత్రను జిల్లా కేంద్రంలో ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆశా కార్యకర్తలకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని, కనీస వేతనం రూ.18వేలకు పెంచుతామని ఎన్నికలకు ముందు కాంగ్రెస్ హామీ ఇచ్చిందన్నారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆశాల సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఆరోగ్యశాఖ మంత్రి, రాష్ట్ర ఉన్నత అధికారులకు, ఎమ్మెల్యేలకు, మంత్రులకు, పలు మార్లు వినతిపత్రాలు అందజేసినా సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదన్నారు. ఎన్‌హెచ్‌ఎం స్కీంలో భాగంగా 19 ఏళ్లుగా రాష్ట్రంలో ఆశా వర్కర్లు పనిచేస్తున్నారన్నారు. వారంతా బడుగు బలహీన వర్గాలకు చెందిన మహిళలని, ప్రసవాల సందర్భంగా రెండు మూడు రోజులు కుటుంబాన్ని వదిలి ఆస్పత్రుల వద్దే ఉండి విధులు నిర్వహిస్తున్నారన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 45వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సిఫారసులు అమలు చేయలేదని, దీంతో దేశవ్యాప్తంగా 10 లక్షల మంది ఆశా కార్యకర్తలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ.సలీమ్, దండంపల్లి సత్తయ్య, మల్లు గౌతమ్‌రెడ్డి, చింతపల్లి బయన్న, నల్ల వెంకటయ్య, ఏర్పుల యాదయ్య, పెంజెర్ల సైదులు, అద్దంకి నరసింహ, పోలె సత్యనారాయణ, పరమేశ్వరి, వెంకటమ్మ, టీ.పార్వతమ్మ, టీ.కల్పన, బీ.మల్లేశ్వరి, కె.స్వర్ణ, ఎర్ర సౌజన్య, విజయకుమారి, ప్రేమలత, పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపిక కోసమే సభలు



నల్లగొండలో అర్హుల నుంచి దరఖాస్తులు తీసుకుంటున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేసేందుకే గ్రామ, వార్డు సభలు నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం నల్లగొండ మునిసిపాలిటీ 1వ వార్డు (పానగల్లు)లో నిర్వహించిన సభలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గత వారం క్రితం నుంచి నిర్వహించిన సర్వేలో అర్హత ఉన్న వారి పేర్లను గ్రామ, వార్డు సభల్లో చదివి వినిపిస్తున్నట్టు తెలిపారు. ఆయా జాబితాలపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే వాటిని పరిగణనలోకి తీసుకుంటామన్నారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల జాబితాల్లో పేర్లు లేనివారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. గ్రామ సభల్లో ఆయా పథకాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో ఏర్పాటుచేసిన ప్రజాపాలన మీసేవా కేంద్రాల్లో సైతం దరఖాస్తు సమర్పించవచ్చన్నారు. అర్హత ఉన్న ప్రతీ లబ్ధిదారుడికి పథకాలు అందించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. నూతనంగా తీసుకున్న దరఖాస్తులను రిజిస్టర్‌లో నమోదు చేయాలని అధికారులకు సూచించారు. గ్రామసభలో ఆమోదం పొందిన జాబితాలను ఎప్పటికప్పుడు డేటా ఎంట్రీ సైతం చేయిస్తున్నామన్నారు. గ్రామసభల్లో ప్రభుత్వ పథకాలకు వచ్చిన దరఖాస్తుదారుల పేర్లు మాత్రమే చదివి వినిపిస్తున్నామని, ఎట్టి పరిస్థితుల్లో అనర్హులు జాబితాలో ఉండరని, అర్హులందరికీ లబ్ధి చేకూరుతుందన్నారు. సమావేశంలో మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలి

(ఆంధ్రజ్యోతి, శాలిగౌరారం): గ్రామ సభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మండల పరిధిలోని వంగమర్తి గ్రామంలో నిర్వహించిన గ్రామసభను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను అధికారులు పరిశీలించి లబ్ధిదారులను ప్రకటిస్తారన్నారు. అనంతరం ఎమ్మెల్యే సామేలు మాట్లాడారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి మాన్యానాయక్, తహసీల్దార్ పి.యాదగిరి, ఏవో సౌమ్యశ్రుతి పాల్గొన్నారు.

సాగు యోగ్యమైన భూములు 12లక్షల ఎకరాలు

నల్లగొండ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాగు యోగ్యమైన భూములు 12లక్షల ఎకరాలు ఉన్నట్లు అధికారులు తేల్చారు. ఈ నెల 16వ తేదీ నుంచి 20వ తేదీ వరకు క్షేత్రస్థాయిలో వ్యవసాయ, రెవెన్యూశాఖ అధికారులు నిర్వహించిన సర్వేలో రైతుభరోసాకు సంబంధించి ఏ మేరకు సాగు యోగ్యమైన భూములు ఉన్నాయనేది లెక్క తేలింది. జిల్లాలో 12లక్షల ఎకరాల భూమి సాగుకు యోగ్యంగా ఉండగా, 12వేల40ఎకరాలు గుట్టలు, రాళ్లు, ఇళ్లు ఉన్నట్లు లెక్కలు తేల్చారు. దీంతో ఆ భూములకు రైతు భరోసాను నిలిపివేయనున్నారు. ప్రభుత్వం రైతు భరోసాను సేద్యం చేసే భూములకు వేయాలనే నిర్ణయించిన నేపథ్యంలో అధికారులు గ్రామాల వారీగా, క్లస్టర్ల వారీగా లెక్కల్లో నిమగ్నమై లెక్కలు తేల్చారు. ఈ నెల 26 నుంచి రైతు భరోసా నిధులను ప్రభుత్వం చెల్లించనున్న విషయం తెలిసిందే. ఎట్టి పరిస్థితులోనూ అనర్హులకు రైతుభరోసా ఇవ్వకూడదని స్పష్టం చేయడంతో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ సాగుకు యోగ్యమైన భూములకు ఈ నెల 26వ తేదీన ప్రభుత్వం రైతుభరోసా చెల్లిస్తుందని తెలిపారు.

12,040ఎకరాలకు రైతు భరోసా నిలిపివేత

లెక్కలు తేల్చిన అధికార యంత్రాంగం

మోదీ హయాంలో సంక్షోభంలో వ్యవసాయం

● రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జూలకంటి రంగారెడ్డి



మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మోదీ మూడోసారి అధికారంలోకి వచ్చి వ్యవసాయ రంగాన్ని మరింత సంక్షోభానికి గురిచేశారని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. ఈ నెల 20, 21 తేదీలలో కోల్‌కతాలో జరిగిన అఖిల భారత కిసాన్ సభ జాతీయ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. వ్యవసాయ పెట్టుబడులు పెరుగుతుండగా పంటకు గిట్టుబాటు ధర లేక అప్పులతో రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అన్నారు. చిన్న, సన్నకారు రైతులు గ్రామాలు విడిచి పట్టణాలకు వలస వెళ్లి కార్మికులుగా పని చేస్తున్నారన్నారు. సమావేశాల్లో ఏఐకేఎస్ ప్రధాన కార్యదర్శి విజ్జ్ కృష్ణన్, మాజీ అధ్యక్షుడు, పార్లమెంట్ సభ్యుడు అమ్రరామ్, మాజీ ప్రధాన కార్యదర్శి హన్నన్ మెల్లా, తెలంగాణ అధ్యక్షుడు పోతినేని సుదర్శన్, కార్యదర్శి తీగల సాగర్, పి.జంగారెడ్డి, బొంతు రాంబాబు పాల్గొన్నారు.

అర్హులందరికీ పట్టాల పంపిణీ

నాగార్జునసాగర్, జనవరి21 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ పట్టాలు పంపిణీ చేస్తామని అదనపు కలెక్టర్ శ్రీనివాస్, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన సాగర్ హిల్‌కాలనీలో విజయవిహార్ అతిథి గృహంలో తిరుమలగిరి(సాగర్) మండలంలో చేపట్టిన ధరణి పైలట్ ప్రాజెక్టుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో భూ సర్వే పూర్తయిందన్నారు. మండల పరిధిలో ఉన్న అటవీ, రెవెన్యూ, కాందిశీకుల భూముల సర్వే పూర్తయిందన్నారు. త్వరలో సీఎం రేవంత్ రెడ్డి పట్టాలు అందజేస్తారన్నారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, డీటీ అనిల్, ఎఫ్‌డీవో సంగీత,అధికారులు పాల్గొన్నారు.

సామాజిక స్పృహతో రచనలు

దేవరకొండ, జనవరి 21(ఆంధ్రజ్యోతి): కవులు, రచయితలు సామాజిక స్పృహతో రచనలు చేస్తారని, అవి సమాజానికి ఉపయోగపడుతాయని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మంగళవారం దేవరకొండ గ్రంథాలయంలో కవి, దళితరత్న అవార్డు గ్రహీత ననికినేని జీవ రాసిన బాలనందం కవిత సంపుటిని ఎమ్మెల్యే ఆవిష్కరించి మాట్లాడారు. కవులు, కళాకారులకు తనవంతుగా ప్రోత్సాహం అందిస్తానన్నారు. దేవరకొండ ప్రాంతంలో కవులు, కళాకారులకు సుదీర్ఘ చరిత్ర ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, తెలంగాణ సాహితి సాంస్కృతి అధ్యాయనవేదిక నాయకులు రంజాన్‌బేగ్, ఉడుత సలేశ్వర్, మెరుగు శ్రీను, కంభాలపల్లి వెంకటయ్య, నల్ల వెంకటయ్య, శ్రవన్‌కుమార్, లక్ష్మీనారాయణ, శారద పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్నే కొనసాగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పన్నాల గోపాల్‌రెడ్డి

మిర్యాలగూడ, జనవరి 21(ఆంధ్రజ్యోతి): సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని నల్లగొండ, వరంగల్, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పన్నాల గోపాల్‌రెడ్డి డిమాండ్‌చేశారు. మంగళవారం స్థానికంగా ఉపాధ్యాయులు, అధ్యాపకులను కలిసి ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. గోపాల్‌రెడ్డికి సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు టీజేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుండెబోయిన నాగేశ్వరావు తెలిపారు. సమావేశంలో క్రాంతి కుమార్, సత్యప్రకాశ్ నాయుడు, పి.జానయ్య తదితరులు పాల్గొన్నారు.

బంజారా భవన్ పనులు పూర్తి చేయాలి

హాలియా, జనవరి 21(ఆంధ్రజ్యోతి): హాలియా మునిసిపాలిటీలో నిర్మిస్తున్న బంజారా భవన్ పనులను వచ్చే నెల 10వ తేదీలోగా పూర్తి చేయాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆంగోతు భగవాన్‌నాయక్ తెలిపారు. మంగళవారం ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి ఆదేశానుసారం బంజారా భవన్ పనులను అధికారులు, కాంట్రాక్టర్లతో కలిసి పరిశీలించారు. ఆయన వెంట సంఘం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పాండునాయక్, సోషల్ వెల్ఫేర్ డీఈ సత్యనాదం, కాంట్రాక్టర్ ఎస్ ఎస్ గోరసి తదితరులు ఉన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



చెస్ పోటీలను ప్రారంభిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి అనిత

దేవరకొండ, జనవరి 21(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని దేవరకొండ మున్సిఫ్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జీ కె.అనిత అన్నారు. మంగళవారం దేవరకొండ కోర్టులో గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన క్రికెట్, చెస్ క్రీడా పోటీలను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జీ రవీందర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గాజుల ఆంజనేయులు, ఏజీపీ నెమికంటి రమాశంకర్, న్యాయవాదులు శౌకత్‌అలీ, పల్లా లోహిత్‌రెడ్డి, ఇందిరవరప్రసాద్‌రావు, రియాజ్, అశోక్ పాల్గొన్నారు.

ఎన్నెస్పీ భూములు హాంఫట్

● రూ.కోట్ల విలువైన ఎన్నెస్పీ భూములు తక్కువ ధరకే కాజేస్తున్న అక్రమార్కులు ● పట్టించుకోని ఎన్నెస్పీ మునిసిపల్ అధికారులు

బహుళార్థ సాధక ప్రాజెక్టు, ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలో రూ.కోట్లు విలువ చేసే వందల ఎకరాల భూములు ఉన్నాయి. ఈ భూములను అధికార, ప్రతిపక్ష నాయకులు తమ సొంత భూములుగా తక్కువ ధరలకే విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కోట్లు విలువ చేసే ఎన్నెస్పీ భూములను అక్రమార్కులు విక్రయిస్తున్నా, ఇటు ఎన్నెస్పీ అధికారులు కానీ, అటు మునిసిపల్ అధికారులు కానీ పట్టించుకోకపోవడంతో స్థానికులు, విశ్రాంత ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి-నాగార్జునసాగర్)



సాగర్‌లో రూ.8లక్షలకు విక్రయించిన స్థలం

హిల్‌కాలనీలో ఎన్నెస్పీ రికార్డులు భద్రపరిచే గోడౌన్‌ను విక్రయించిన ఓ కౌన్సిలర్

నాగార్జునసాగర్ పరిస్థితి రెంట చెడ్డ రేవడిలా తయారైంది. 2018కి ముందు సాగర్‌లో ఉన్న హిల్‌కాలనీ, పైలాన్ కాలనీల నిర్వహణ, తాగు నీటి సరఫరా విభాగం, విద్యుత్, నివాస గృహాల అద్దెల వసూళ్లు వంటివి ఎన్నెస్పీ పరిధిలో ఉండేవి. కానీ 2018లో నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం నాగార్జునసాగర్‌ను నందికొండ మునిసిపాలిటీగా ఏర్పాటుచేసింది. 2020లో మొదటిసారిగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించింది. దీంతో రెండు కాలనీల్లో మొత్తం 12మంది కౌన్సిలర్లు ఎన్నుకోబడ్డారు. నాటి నుంచి ఎన్నెస్పీ భూములను అక్రమంగా విక్రయించడం విచ్చలవిడిగా సాగుతుంది. గతంలో ఎన్నెస్పీ భూములను ఎన్నెస్పీ అధికారులే పరిరక్షించేవారు. కానీ మునిసిపాలిటీగా ఏర్పడిన తర్వాత అటు ఎన్నెస్పీ అధికారులు కానీ, ఇటు మునిసిపల్ అధికారులు కానీ పట్టించుకోవడంలేదు. దీంతోనే ఎన్‌ఎస్పీ భూముల ఆక్రమణలు ఎక్కువయ్యాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. భూముల ఆక్రమణలపై మునిసిపల్ అధికారులను వివరణ కోరగా నందికొండ మునిసిపల్ పరిధిలో ఉన్న భూములు తమకు ఎలాంటి సంబంధం లేదని, అవి పూర్తిగా ఎన్నెస్పీ ఆధీనంలోనే ఉన్నాయని తెలిపారు. ఇదే విషయంపై ఎన్‌ఎస్పీ ఈఈ మల్లికార్జున్ రావును వివరణ కోరగా నాగార్జునసాగర్ నందికొండ మునిసిపాలిటీగా ఏర్పడిన తర్వాత ఖాళీగా ఉన్న ఎన్నెస్పీ భూములను, నివాస గృహాలను, తాగు నీటి నిర్వహణ విభాగాలను మునిసిపాలిటీ ఆధీనంలోకి తీసుకోవాలని పలుమార్లు లేఖలు రాశామని, అయినా వారు పట్టించుకోలేదని తెలిపారు. గతంలో ఎన్నెస్పీకి సరిపడా సిబ్బంది లేకపోవడంతో ఎన్నెస్పీ భూముల పరిరక్షణ ఇబ్బందిగా ఉండేదని, ప్రస్తుతం సిబ్బంది కొరత లేకపోవడంతో నిరంతరం కాలనీల్లో ఉన్న ఎన్నెస్పీ ఖాళీ భూములపై నిఘా ఉంచామన్నారు. నాగార్జునసాగర్‌లో ఎన్నెస్పీ భూములకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఉండదు, దీన్ని ఆసరాగా కొంత మంది అక్రమార్కులు అమాయకులకు విక్రయించి డబ్బులు దండుకుంటున్నారు.

సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు

నందికొండ మునిసిపాలిటీలో హిల్‌కాలనీ, పైలాన్ కాలనీల్లో ఉన్న ఖాళీ ఎన్నెస్పీ భూములను గత ప్రభుత్వం హయాంలో కౌన్సిలర్లు తమ వార్డుల్లో ఉన్న భూములను ఒక చోట రూ.24 లక్షలకు, మరో చోట రూ.8లక్షలకు విక్రయించారు. ఓ కౌన్సిలర్ ఏకంగా ఎన్నెస్పీ రికార్డులను భద్రపరిచే గోడౌన్‌ను, పక్కనే ఉన్న ఖాళీ స్థలాన్ని రూ.3లక్షలకు విక్రయించినట్లు సమాచారం.

కఠిన చర్యలు తప్పవు



నాగార్జునసాగర్‌లో, నందికొండ మునిసిపాలిటీ పరిధిలో ఉన్న ఎన్‌ఎస్పీ భూమునలు ఆక్రమించిన, అమ్మిన కఠిన చర్యలు తప్పవు. అలా ఎవరైన అమ్మితే తెలిసిన వారు తమకు సమాచారం ఇవ్వాలి.

మల్లికార్జున్‌రావు, ప్రాజెక్టు ఈఈ

నేటి గ్రామసభలు ఇవే

నిడమనూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేయనున్న నాలుగు సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపికకోసం మండలంలోని నిడమనూరు, వేంపాడ్, వెంగన్నగూడెం, వల్లభాపురం, బంటువారిగూడెం, ఎర్రబెల్లి, బొక్కమంతలపహడ్, ముకుందాపురం గ్రామాల్లో బుధవారం అధికారులు గ్రామసభలు నిర్వహించనున్నారు. ఆయా గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గ్రామసభలు నిర్వహించి ప్రజలనుంచి ఆర్జీలు స్వీకరించనున్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

నిడమనూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది జనవరి 1వ తేదీకి ముందు కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు వచ్చిన రైతులు రైతుభరోసా పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి మునికృష్ణయ్య ఓ ప్రకటనలో తెలిపారు. భూమికి సంబంధించిన పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు ఖాతా నెంబరుతోపాటు ఆధార్ జీరాక్స్ పత్రాలు తమ కార్యాలయంలో ఈ నెల 24 వరకు సమర్పించాలన్నారు.

నేటినుంచి ఉర్సు

చింతపల్లి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): చింతపల్లి మండలంలోని పోలేపల్లిరాంనగర్ గట్టుపీర్ల దర్గా ఉర్సు ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభకానున్నాయి. ఈ సందర్భంగా నిర్వాహకుడు పడకంటి జంగయ్య ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి 12 గంటలకు ఒంటెపై గ్రామపురవీధుల గుండా ఊరేగింపుతో దర్గా వద్దకు చేరుకుంటున్నారు. ప్రత్యేక ప్రార్థనలు చేపట్టనున్నారు.

ఐదేళ్లలో 20వేల ఇందిరమ్మ ఇళ్లు పంపిణీ చేస్తాం

● అర్హులందరికీ రేషన్ కార్డులు అందజేస్తాం ● బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదు ● దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ● అంతటా ప్రజాపాలన గ్రామసభలు



దేవరకొండలో మాట్లాడుతున్న దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్

దేవరకొండ, జనవరి 21(ఆంధ్రజ్యోతి): దేవరకొండ నియోజకవర్గంలో ఐదేళ్లలో 20వేల ఇందిరమ్మ ఇళ్లు పంపిణీ చేస్తామని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మంగళవారం పట్టణంలోని 5వ వార్డు, శక్రుతండా గ్రామాల్లో నిర్వహించిన గ్రామ, వార్డు సభలలో ఆయన మాట్లాడారు. అర్హులైన పేదలందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తుందన్నారు. పదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఒక్క రేషన్‌కార్డు కూడ ఇవ్వలేదన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని 107 మంది బాధితులకు మంజూరైన రూ.40లక్షల 13వేల సీఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, ఆర్డీవో రమణారెడ్డి, మున్సిపల్ కమీషనర్ సుదర్శన్, 5వ వార్డు కౌన్సిలర్ వడ్త్య దేవేందర్‌నాయక్, ప్రత్యేక అధికారిణి లక్ష్మీ, ఏఈ హుస్సేన్, సిరాజ్‌ఖాన్ పాల్గొన్నారు.

పెద్దఅడిశర్లపల్లి: రమావత్ బిచ్యానాయక్ మృతి బాధాకరమని ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. గుడిపల్లి మండలంలోని మాదాపురంలో బిచ్యానాయక్ మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

అర్హులందరికీ రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు

నాగార్జునసాగర్: అర్హులందరికీ రేషన్ కార్డులు ఇస్తామని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అన్నారు. నందికొండలో వార్డుసభలను పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ ముక్తార్ పాల్గొన్నారు.

పెద్దవూర: ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు లబ్దిదారులను ఎంపిక చేయడంలో అర్హులందరినీ గుర్తించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో గ్రామసభల తొలిరోజు తీరుతెన్నులపై సమీక్షా నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి రాజ్‌కుమార్, ఎంపీడీవో సుధీర్‌కుమార్, తహసీల్దార్ సరోజపావని, సందీప్‌కుమార్, హఫీజ్, ఆర్‌ఐ హబీబ్, కార్యదర్శులు పాల్గొన్నారు.

చందంపేట: చందంపేట మండలంలోని అచ్చంపేటపట్టి, బొల్లారం, బుడ్డోనితండా, బిల్డింగ్‌తండా, చందంపేట, చిత్రియాల, గాగిళ్లపురం, గన్నేర్లపల్లి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. గ్రామసభలలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో లక్ష్మీ, డిప్యూటీ తహసీల్దార్ గోవర్ధన్‌రెడ్డి, ఎంఈవో చందర్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

నిడమనూరు: మండలంలోని ఇండ్లకోటయ్యగూడెం, తుమ్మడం, బంకాపురం, వెనిగండ్ల, రాజన్నగూడెం, పార్వతీపురం, వడ్డెరగూడెం, మార్లగడ్డ క్యాంపు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జంగాల కృష్ణయ్య, ఎంపీడీవో గుర్రం వెంకటేశం, ఏవో మునికృష్ణయ్య, పీఆర్ ఏఈ సాయిప్రసాద్, ఎంఈవో వెంకన్న పాల్గొన్నారు.

నాంపల్లి: మండలంలోని గట్లమల్లేపల్లి, ముష్టిపల్లి, పెద్దాపురం, మల్లపురాజుపల్లి, ఎస్‌డబ్ల్యూ లింగోటం, వడ్డెపల్లి, నాంపల్లి గ్రామాలలో గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ దేవసింగ్, ఎంపీడీవో మేరీ స్వర్ణకుమారి, మల్లిఖార్జున్‌రావు, రామచంద్రయ్య పాల్గొన్నారు.

వేములపల్లి: మండలంలోని బుగ్గబావిగూడెం, ఆమనగల్లు, రావులపెంట గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్‌రావు, తహసీల్దార్ పుష్పలత, ఎంపీడీవో శారదాదేవి, ఎంపీవో లలిత, ఎంఏవో కిశోర్‌నాయక్, కార్యదర్శులు సబిత, రాంరెడ్డి పాల్గొన్నారు.

మాడ్గులపల్లి: మండలంలోని గ్యారకుంటపాలెం, కేశవాపురం, మాచినపల్లి, గోపాలపురం, కన్నెకల్, అభంగాపురం, దాచారం గ్రామాల్లో మంగళవారం గ్రామ సభలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో తిరుమలస్వామి, ఎంఈవో వెంకటమ్మ, ఏపీఎం చంద్రశేఖర్, తహసీల్దార్ సురేష్, ఎంపీడీవో సంగీత, ఏపీవో శ్రీనివాస్‌రెడ్డి, ఏవో శివకుమార్ పాల్గొన్నారు.

హాలియా: హాలియాలోని 1, 5, 9వ వార్డుల్లో వార్డుసభలు, మండలంలో తిమ్మాపురం, కొత్తపల్లి, పంగవానికుంట, పంగవానికుంట తండా, వీర్లగడ్డతండాలలో గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో కమిషనర్ రామదుర్గారెడ్డి, ఎంపీడీవో సుజాత, యడవల్లి నరేందర్‌రెడ్డి, కాకునూరి నారాయణగౌడ్, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

అడవిదేవులపల్లి: మండలంలోని బంగారికుంటతండా, జిలకరకుంటతండా, నడిగడ్డ, నల్లమిట్టతండా, మొల్కచర్ల గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మోసిన్‌బిన్‌అహ్మద్, తహసీల్దార్ కారింగుల శ్రీనివాస్, ఆర్‌ఐ శ్యామ్, పాల్గొన్నారు.

గుర్రంపోడు: మండలంలోని మక్కపల్లి, పాల్వాయి, మైలాపురం, చేపూరు, కోయగూరవానిబావి, పోచంపల్లి, జూనుతుల, ఆమలూరు, బొల్లారం గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి వెంకటేశ్వర్లు, ఎంపీడీవో మంజూల, డిప్యూటీ తహసీల్దార్ ఫరీద్, ఎంపీవో పద్మ, సైదులు పాల్గొన్నారు.

మాడ్గులపల్లి: మండలంలోని గ్యారకుంటపాలెం, కేశవాపురం, మాచినపల్లి, గోపాలపురం, కన్నెకల్, అభంగాపురం, దాచారం గ్రామాల్లో మంగళవారం గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో తిరుమలస్వామి, ఎంఈవో వెంకటమ్మ, ఏపీఎం చంద్రశేఖర్, తహసీల్దార్ సురేష్ ఎంపీవో సంగీత, ఏపీవో శ్రీనివాస్‌రెడ్డి, ఏవో శివకుమార్ పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి: మండలంలోని కేశ్యతండాలోని గ్రామ సభ నిర్వహించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దస్రూనాయక్ ఉన్నారు.

తిరుమలగిరి(సాగర్): మండలంలోని మేగ్యాతండా, తునికినూతల, తూటిపేటతండా, పిల్లిగుండ్లతండా, బట్టువెంకన్నబావితండా, ఎర్రచెరువుతండా, అల్వాల, తిరుమలగిరి, ఎల్లాపురం గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎంపీడీవో మల్లీశ్వర్, ఎంపీవో భిక్షంరాజు, ఎంఈవో శ్రీనివాస్, ఏఈలు పాల్గొన్నారు.

మిర్యాలగూడ రూరల్: మండలంలోని 12 గ్రామపంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరిబాబు, ఆర్‌ఐలు రామకృష్ణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: మండలంలోని గొల్లపల్లి, తిరుమలాపురం, ఉప్పరపల్లి, హోమంతాలపల్లి, దేన్యాతండా, మదనాపురం, చాకిలిశేరుపల్లి, బోటిమిది తండాల్లో ఎంపీడీవో సుజాత, తహసీల్దార్ రమాకాంత్‌శర్మ ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు.

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలి

పెద్దఅడిశర్లపల్లి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని గుడిపల్లి జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల క్లస్టర్ రిసోర్స్ పర్సన్ బొడ్డుపల్లి కరుణ అన్నారు. మంగళవారం విద్యాశాఖ సమగ్రశిక్షలో భాగంగా బడిబయట పిల్లల సర్వే-2025ను గుడిపల్లి మండలంలోని ఘనపురం, పోల్కంపల్లి, భీమనపల్లి, రాయినిపాలెం, ఘట్‌నెమలిపురం, కేశంనేనిపల్లి, పోతిరెడ్డిపల్లి, గుడిపల్లి, సురేపల్లి, రోళ్లకల్లులో పది రోజులుగా నిర్వహిస్తున్నారు. ఈ సర్వేను గుడిపల్లి ఎంఈవో సముద్రాల శ్రీనయ్యతో కలిసి పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీఎస్ హెచ్‌ఎం రాంబాబు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి: ప్రతీ విద్యార్థి తప్పనిసరిగా అపార్ ఐడీ జనరేట్ చేసుకోవాలని ఎంఈవో ఆర్.నాగేశ్వర్‌రావు సూచించారు. మండలకేంద్రంలో హెచ్‌ఎంలతో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మండల పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, రెసిడెన్షియల్, ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు పూర్తి వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. సమావేశంలో మారం శివశంకర్, జమీర్‌హుస్సేన్, దారం శ్రీనివాస్, స్వాతి పాల్గొన్నారు.

పేదలందరికీ సంక్షేమ పథకాలు అందజేయాలి

దేవరకొండ, చింతపల్లి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): పేదలందరికీ సంక్షేమ పథకాలు అందజేయాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఏటికృష్ణ, రాష్ట్రనేత బెజవాడ శేఖర్ అన్నారు. దేవరకొండలో బీజేపీ ఆధ్వర్యంలో దేవరకొండ పట్టణ కమిటి ఆధ్వర్యంలో బీజేపీ నేతలు ఆర్డీవో రమణారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు వస్కుల సుధాకర్, నక్క వెంకటేష్‌యాదవ్, ఉప్పల వెంకటేష్, నేతాళ్ల వెంకటేష్, చండీశ్వర్, బిక్కునాయక్, సహదేవ్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా చింతపల్లిలో ఎంపీడీవో కార్యాలయం ఎదుట బీజేపీ నేతలు నిరసన తెలిపారు. కార్యక్రమంలో నక్క వెంకటేష్, సముద్రాల నగేష్, కుక్కుడపు రామకృష్ణ, వెన్నం శేఖర్, ఎండి.జహంగీర్, బొడ్డు మహేష్ పాల్గొన్నారు.

రెవెన్యూ ఒకచోట.. పోలీస్‌స్టేషన్ మరోచోట

● పోలీస్ స్టేషన్ల పరిధి ఇంకెప్పుడు మారేదీ..? ● మాడ్గులపల్లి మండలంలోని పలు గ్రామాలు పాత పీఎస్ ఆధీనంలోనే ● కొత్త మండలం ఏర్పడి తొమ్మిదేళ్లయినా తేల్చని ప్రభుత్వం



మాడ్గులపల్లి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): జిల్లాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా 2016 అక్టోబర్‌లో మాడ్గులపల్లి నూతన మండలంగా ఏర్పాటైంది. ఉమ్మడి వేములపల్లి మండలం నుంచి 13 గ్రామాలు, నిడమనూరు మండలం నుంచి 7, త్రిపురారం మండలం నుంచి 3, తిప్పర్తి మండలం నుంచి 5 గ్రామాలు మొత్తం 28 గ్రామపంచాయతీలతో నూతనంగా మాడ్గులపల్లి మండలాన్ని ఏర్పాటు చేశారు. రెవెన్యూ పరంగా అన్ని గ్రామాలు మాడ్గులపల్లి మండలంలో విలీనం కాగా కొన్ని గ్రామాలు మాత్రం ఇప్పటికీ ఉమ్మడి వేములపల్లి, నిడమనూరు పోలీస్‌స్టేషన్ల పరిధిలో కొనసాగుతున్నాయి. దీంతో ఫిర్యాదుదారులు రెవెన్యూపరంగా మాడ్గులపల్లి, పోలీస్‌స్టేషన్‌పరంగా నిడమనూరు మండలాలకు చేరుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. రెవెన్యూ పరిధిలో అన్ని గ్రామాలు పోలీస్‌స్టేషన్ పరిధిలో కూడా మాడ్గులపల్లికే ఉండేలా అధికారులు చొరవ తీసుకోవాలని పలుమార్లు విన్నవించినా పట్టించుకునేవారు కరువయ్యారని పలు గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఏయే గ్రామాలు ఏయే స్టేషన్ల పరిధిలో..

పోరెడ్డిగూడెం, పాములపాడు, చర్లగూడెం, భీమనపల్లి, గుర్రప్పగూడెం, బొమ్మకల్ గ్రామాల ప్రజలు వేములపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో కొనసాగుతుండగా, గోపాలపురం, ధర్మాపురం, మాచినపల్లి గ్రామాలు నిడమనూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్నాయి. ఈ గ్రామాల మొత్తం రెవెన్యూపరంగా మాడ్గులపల్లిలో ఉన్నప్పటికీ పోలీస్‌స్టేషన్ల పరిధి మాత్రం ఉమ్మడి నిడమనూరు, వేములపల్లి పోలీస్‌స్టేషన్ల పరిధిలోనే కొనసాగుతున్నాయి. పోలీస్‌స్టేషన్ పరిధిపై కొంత మంది అవగాహన లేని వారు సమస్యలపై మాడ్గులపల్లి పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయిస్తుండడంతో అక్కడికి వెళ్లిన ఫిర్యాదుదారులను పోలీస్ సిబ్బంది వేములపల్లి, నిడమనూరు పోలీస్‌స్టేషన్లకు పంపిస్తున్నారు. రెవెన్యూ పనులు మొత్తం మాడ్గులపల్లి మండల కేంద్రంలో జరుగుతుండగా పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేసేందుకు ఇతర మండలాలకు వెళ్లాల్సి వస్తుందని ఫిర్యాదుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అత్యవసర పరిస్థితుల్లోనూ ఇబ్బందులు...

బొమ్మకల్లు, పాములపాడు, చర్లగూడెం, భీమనపల్లి, గుర్రప్పగూడెం, పోరెడ్డిగూడెం గ్రామాలు వేములపల్లి నుంచి 20కి.మీ దూరంలో ఉన్నాయి. అత్యవసర పరిస్థితుల్లో వీటిలో కొన్ని గ్రామాలకు పోలీస్ సిబ్బంది చేరుకోవాలంటే సమయం పడుతుంది. డయల్ 100కు ఫిర్యాదులు అందినప్పుడు నిర్ణీత సమయంలో చేరాలంటే ఇబ్బందులు పడుతున్నామని పోలీస్ సిబ్బంది వాపోతున్నారు. ధర్మాపురం, గోపాలపురం, మాచినపల్లి గ్రామాలు సైతం నిడమనూరు పోలీస్‌స్టేషన్‌కు దూరంగా ఉండడంతో రాపకోకలకు అవస్థలు తప్పడం లేదు.

జాప్యం అందుకేనా...

కొత్త మండలాల ఏర్పాటు సమయంలో మండలంలోని గ్రామాల సంఖ్యను ప్రాతిపదికన తీసుకొని పోలీసుశాఖ స్టేషన్ల పరిధిని నిర్ధారించింది. మాడ్గులపల్లి మండలంలో 28 గ్రామాలుండగా వీటిని పూర్తిస్థాయిలో అదే పోలీస్‌స్టేషన్ పరిధిలో తీసుకొస్తే ఉమ్మడి వేములపల్లి, నిడమనూరు స్టేషన్ల పరిధిలో గ్రామాల సంఖ్య తగ్గి కేసులు తగ్గుముఖం పట్టే అవకాశం ఉంది. అత్యధిక గ్రామాలు ఉన్న స్టేషన్ పరిధిలో కేసుల సంఖ్య పెరిగి సిబ్బందిపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది. ఈ కారణంగానే పోలీస్‌శాఖ మాడ్గులపల్లి రెవెన్యూ పరిధిలో పలు గ్రామాలను ఉమ్మడి మండలాల పోలీస్ స్టేషన్ల పరిధిలోనే కొనసాగిస్తున్నట్లు తెలిసింది.

ఇబ్బందులు పడుతున్నాం



మా గ్రామం మాడ్గులపల్లి రెవెన్యూ పరిధిలో ఉండగా పోలీస్‌స్టేషన్ నిడమనూరు పరిధిలో ఉంది. దీంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలంటే నిడమనూరుకు వెళ్లాల్సి వస్తుంది. పోలీస్ స్టేషన్ల పరిధిపై అవగాహన లేని ప్రజలు ఫిర్యాదులు చేయడానికి మాడ్గులపల్లి పోలీస్‌స్టేషన్‌కు వెళ్తూ ఇబ్బందులు పడుతున్నారు.

బోడ యాదయ్య, గోపాలపురం

ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తాం

ప్రజల ఆలోచనలకు అనుగుణంగా పోలీసుశాఖ పరిశీలించి ప్రజలకు ఏవిధంగా ఉపయోగకరంగా ఉంటుందో ఎస్పీకి నివేదిస్తాం. సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తా.

రాజశేఖర్‌రాజు, డీఎస్పీ, మిర్యాలగూడ

సంక్షిప్తంగా..

● మిర్యాలగూడ: తనపై మాజీ ఎంపిటీసీ భర్త చేస్తున్న అసత్య ఆరోపణలు మానుకోవాలని అవంతీపురం గ్రామపంచాయతీ కార్యదర్శి సోమిడి గాయత్రి అన్నారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ తనపై కొందరు పనిగట్టుకుని వాట్సప్‌లలో అవినీతికి పాల్పడుతున్నట్లు రికార్డులు మార్పు చేసి డబ్బులు వసూలు చేస్తున్నట్లు ప్రచారం చేస్తున్నారన్నారు.

● చందంపేట: మండలంలోని ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చందంపేట తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని పోలేపల్లి గ్రామశివారులో సర్వేనెంబర్ 217లో నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమిని పరిశీలించారు. ఆయన వెంట చందంపేట ఎస్‌ఐ సతీష్, సర్వేయర్ జైసన్, అనిల్ ఉన్నారు.

● డిండి: ఆరు గ్యారంటీలను అమలు చేయాలని బీఆర్‌ఎస్‌నేత ఎలిమినేటి వెంకట్ ద్రావిడ్ అన్నారు. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు ఇవ్వాలన్నారు.

● నిడమనూరు: నిడమనూరులో శాలివాహన చక్రవర్తి విగ్రహం ఏర్పాటు చేయనున్నట్లు శాలివాహన సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ఎలిజాల వెంకన్న తెలిపారు. అనంతరం సంఘం నూతన క్యాలెండర్‌ను ఎస్‌ఐ గోపాల్‌రావు ఆవిష్కరించారు.

● కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లిలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహం ఏర్పాటు చేయాలని సమితి ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ ఈవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో శేఖర్‌యాదవ్, శ్రీను, మల్లేష్, దాసు, భరత్, సాయి, సురేష్ పాల్గొన్నారు.

● దేవరకొండ: పట్టణంలోని 5వ వార్డులో రోడ్లు, డ్రైనేజీ కాల్వల సమస్యలు పరిష్కరించాలని కమిషనర్ సుదర్శన్‌కు వినతిపత్రం అందజేశారు.

● నాంపల్లి: నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డిని నల్లగొండలో పోలీసులు అరెస్ట్ చేసి నాంపల్లి స్టేషన్‌కు తరలించగా మండల బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన తెలిపారు. కార్యక్రమంలో రామాంజనేయులు, సపావట్ సర్దార్ నాయక్, బొడ్డు జగన్ పాల్గొన్నారు.

● హాలియా: మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డిపై కోమటిరెడ్డి అనుచరులు, చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు నాగార్జునసాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఒత్తిడికి తలొగ్గి పోలీసులు అక్రమ కేసులు బనాయించి కక్ష సాధింపు చర్యలకు పోలీసులు సహకరించవద్దన్నారు.

● వేములపల్లి: నిజమైన లబ్ధిదారులను గుర్తించాలని సీపీఎం జిల్లానేత రొండి శ్రీనివాస్ అన్నారు. బుగ్గబావిగూడెంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామాల్లో నిర్వహిస్తున్న గ్రామసభల్లో నూతన రేషన్‌కార్డుల జారీ విషయంలో నిరుపేదలకు చోటు దక్కకుండా అన్ని రకాల ఆస్తిపాస్తులు ఉన్న వారికే రేషన్‌కార్డులు అందుతున్నాయని ఆరోపించారు.